ప్రయాణికులతో ఆడుకున్నారు

సీఎం సభకు నాలుగో వంతు ఆర్టీసీ బస్సులు



ఆర్టీసీ ద్వారకా సిటీ బస్టాప్ వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- ఉదయం 10 గంటల నుంచే మళ్లింపు
- బస్టాపుల్లో జనం పడిగాపులు
- మరోవైపు వార్డుల్లో ఆర్‌పీల బెదిరింపులు
- సభకు రాకపోతే రుణమాఫీకి సంతకాలు చేయబోమని డ్వాక్రా గ్రూపు సభ్యులకు హెచ్చరికలు
- అయినా స్పందన శూన్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

'ఆడుదాం...ఆంధ్రా' క్రీడా పోటీల ముగింపు వేడుకల నిర్వహణ పేరుతో పాలకులు మంగళవారం నగర ప్రజలకు చుక్కలు చూపించారు. పీఎం పాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటుచేసిన బహుమతి ప్రదానోత్సవాన్ని రాజకీయ కార్యక్రమంగా మార్చేశారు. సీఎం జగన్ హాజరవ్వడంతో ఆర్టీసీ బస్సుల్లో నాలుగో వంతు (230) జనాన్ని తరలించేందుకు కేటాయించారు. దాంతో ఆర్‌టీసీ బస్సులపై ఆధారపడిన నగర వాసులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్టేడియం వద్దకు ... మిగతా 4వ పేజీలో



జనం లేక ఖాళీగా వున్న గ్యాలరీ



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

బహుమతులిచ్చే కార్యక్రమానికి మమ్మల్ని ఎందుకు తీసుకొచ్చారు?

- పోలీసులను ప్రశ్నించిన మహిళలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆటల్లో బహుమతులిచ్చే కార్యక్రమానికి తమను ఎందుకు తీసుకువచ్చారంటూ 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకలకు వచ్చిన మహిళలు కొందరు పోలీసులను ప్రశ్నించారు.

నగరంలోని డ్వాక్రా సంఘాల మహిళలను బస్సుల్లో ముగింపు వేడుకలు జరిగే స్టేడియం వద్దకు సాయంత్రం నాలుగు గంటలకే తరలించారు. సాయంత్రం ఆరు గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కడకు వచ్చేంత వరకూ వారిని గ్యాలరీల్లో కూర్చోవాలంటూ వారి ప్రాంతాలకు సంబంధించిన వలంటీర్లు, ఆర్‌పీలు ఆదేశించారు. తీరా అక్కడకు వెళ్లిన తర్వాత ఆటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమం అని తెలుసుకున్నారు. పైగా గంటల తరబడి గ్యాలరీల్లో కూర్చోలేక బయటకు వెళ్లిపోయేందుకు సీట్లలో నుంచి లేచారు. వారంతా బయటకు వెళ్లిపోతుండడంతో అక్కడున్న పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. 'ఎవరికో బహుమతులు ఇచ్చేదానికి మేమందుకంటూ' తమ అసహనాన్ని వ్యక్తంచేశారు. దీంతో పోలీసులు కొందరు తమకెందుకొచ్చిన తలనొప్పి అన్నట్టు వారికి అడ్డు తప్పుకోగా, మరికొందరు మాత్రం గ్యాలరీ నుంచి బయటకు వచ్చే గేట్లకు తాళాలు వేయడం కనిపించింది. సీఎం జగన్ స్టేడియంకు రాకముందే చాలామంది మహిళలు నడుచుకుంటూ జాతీయ రహదారిపైకి వెళ్లి ఆటోల్లో తమ ఇళ్లకు వెళ్లిపోయారు. మరికొందరు తమ బస్సులు పార్కింగ్ చేసిన చోటకు వెళ్లిపోవడం విశేషం.

జేఈఈ మెయిన్స్ మెరుపులు

99.999, 99.990 పర్సంటైల్ సాధించిన విశాఖ విద్యార్థులు



మద్ది రిషివర్ధన్ 99.999 పర్సంటైల్



ధనుకొండ శ్రీనిధి 99.990 పర్సంటైల్



కోరుప్రోలు రాకేశ్ 99.978 పర్సంటైల్



బీరి సాహితి 99.977 పర్సంటైల్

- వెయ్యి నుంచి 1,500 మంది 99.00 నుంచి 99.999 పర్సంటైల్ సాధించారని అంచనా
- కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థుల హవా

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ/ఎన్ఐటీల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 'సెషన్-1'లో విశాఖపట్నం విద్యార్థులు సత్తా చాటారు. నగరంలో చదివిన మద్ది రిషివర్ధన్ 99.999, ధనుకొండ శ్రీనిధి 99.990 పర్సంటైల్ సాధించారు.

ఏటా రెండు పర్యాయాలు జేఈఈ పరీక్షలు నిర్వహిస్తారు. తొలి సెషన్ గత నెలలో 300 మార్కులకు నిర్వహించారు. ఏప్రిల్‌లో మరోమారు పరీక్ష నిర్వహిస్తారు. తొలి సెషన్ పరీక్షలకు నగరంలో 20 వేల మంది వరకూ హాజరయ్యారు. తొలి సెషన్ పరీక్షలో శ్రీచైతన్య, నారాయణ, ఫిట్జీ, అసెంట్, తదితర సంస్థల్లో చదివిన విద్యార్థులు మెరుగైన పర్సంటైల్ సాధించారు. 99.00 నుంచి 99.999 పర్సంటైల్ వరకూ 1000 నుంచి 1500 మందికిపైగా సాధించారని అంచనా వేస్తున్నారు. నారాయణ విద్యా సంస్థకు చెందిన మద్ది రిషివర్ధన్ 99.999 పర్సంటైల్‌తో మొదటి స్థానంలో, శ్రీచైతన్య ఐఐటీ అకాడమీకి చెందిన ధనుకొండ శ్రీనిధి 99.990 పర్సంటైల్‌తో రెండో స్థానంలో నిలిచారు. రిషివర్ధన్ గణితంలో 100కి 100, ఫిజిక్స్‌లో 90, కెమిస్ట్రీలో 95 మార్కులు సాధించాడు. నారాయణ విద్యా సంస్థల్లో 99.900, అంతకంటే ఎక్కువ పర్సంటైల్ 57 మంది సాధించారు. శ్రీచైతన్యకు చెందిన కోరుప్రోలు రాకేశ్ 99.978, బీరి సాహితి 99.977, చింతల తేజస్విని మనోజ్ఞ 99.974, ఆళ్ల రామలింగంనాయుడు 99.967, అన్నెపు సాత్విక్ 99.959 పర్సంటైల్ సాధించారు. ఫిట్జీ విద్యార్థి శ్రీరామ వెంకటకృష్ణ 99.936, అసెంట్ విద్యార్థి డొంకా హరీశ్‌కుమార్ 99.931 పర్సంటైల్ సాధించారు.

ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేయాలన్నదే లక్ష్యం

- మద్ది రిషివర్ధన్, 99.999 పర్సంటైల్ విద్యార్థి

జేఈఈ మెయిన్స్‌లో 99.999 పర్సంటైల్ సాధించడం సంతోషంగా ఉంది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు నారాయణ విద్యా సంస్థల్లోనే చదివా. టెన్త్ సీబీఎస్ఈ సిలబస్‌లో 476 మార్కులు వచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేయాలన్నదే లక్ష్యం. సొంతూరు విజయనగరం. నాన్న ... మిగతా 4వ పేజీలో

ఓటర్ల జాబితాలో అవకతవకలు

- అందుకు కలెక్టరే బాధ్యులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు
- మల్లికార్జున హయాంలో అనేక భూ కుంభకోణాలు
- టీడీపీ నేత బండారు ఆరోపణ
- విశాఖ కలెక్టర్‌పై ఎన్నికల సంఘం విచారణ జరపాలని డిమాండ్
- లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- మల్లికార్జున హయాంలో జరిగిన కుంభకోణాలకు ఆధారాలు ఉన్నాయి: ఎమ్మెల్యే వెలగపూడి



సమావేశంలో మాట్లాడుతున్న బండారు. చిత్రంలో ఎమ్మెల్యే వెలగపూడి ఉన్నారు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లాలో ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, ఇందుకు కలెక్టర్ మల్లికార్జున బాధ్యులని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్ల తొలగింపు, చేర్పులపై అనేక ఆరోపణలు వచ్చినా కలెక్టర్ పట్టించుకోవడం లేదన్నారు. అలాగే అనేక భూ కుంభకోణాలపై ఫిర్యాదులు వచ్చినా ఒక్క దానిపై కూడా కలెక్టర్ చర్యలు తీసుకోలేదన్నారు. వైసీపీకి చెందిన విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డిలతో కలెక్టర్ చేతులు కలిపారని బండారు ఆరోపించారు. పెందుర్తి మండలం ముదపాకలో దళితుల భూములను సుబ్బారెడ్డికి, జలవిహార్ రామరాజుకు కట్టబెట్టారన్నారు. బాధిత దళితులు కోర్టుకు వెళితే పెందుర్తి తహసీల్దారును నగరంలో సీతమ్మధార మండలానికి బదిలీ చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. జె్రరిపోతులపాలెంలో భూముల పరిరక్షణకు ప్రస్తుత విశాఖ ఆర్డీవో, బదిలీపై వెళ్లిన జేసీ విశ్వనాథన్ విచారించి నివేదిక ఇస్తే ఇంతవరకూ కలెక్టర్ చర్యలు తీసుకోలేదని ధ్వజమెత్తారు. విశాఖ నగరంలో మొత్తం 12 భూకుంభకోణాలు జరిగాయని బండారు ఆరోపించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండే రూ.రెండు వేల కోట్ల విలువైన దసపల్లా భూములను ఎంపీ విజయసాయిరెడ్డి, ఆయన వర్గీయులకు కలెక్టర్ కట్టబెట్టారన్నారు. భీమిలి బీచ్‌రోడ్డులో రామానాయుడు స్టూడియోకు కేటాయించిన 34 ఎకరాల్లో రెసిడెన్షియల్ లేఅవుట్ వేసుకునేలా వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో కలెక్టర్ మార్పులు చేశారన్నారు. హయగ్రీవ భూముల విషయంలో అధికార పార్టీ నేతలకు కలెక్టర్ అనుకూలంగా వ్యవహరించారన్నారు. రుషికొండలో అక్రమ నిర్మాణాలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ప్రేక్షకపాత్ర పోషించారని ధ్వజమెత్తారు. జిల్లాను నడిపించాల్సిన కలెక్టర్ అలా ఉంటే...ఎన్నికలు ఎలా సజావుగా జరుగుతాయో ఎన్నికల కమిషన్ ఆలోచించాలన్నారు. నిజాయితీగా పనిచేస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను ఎందుకు బదిలీ చేశారో చెప్పాలన్నారు. ఓటర్ల జాబితాల తయారీ, భూ కుంభకోణాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న కలెక్టర్ సెలవు పెట్టి వెళ్లిపోవడం మంచిదన్నారు. కలెక్టర్‌పై ఎన్నికల సంఘం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. త్వరలో టీడీపీ, జనసేన ప్రభుత్వం ... మిగతా 4వ పేజీలో

మొక్కుబడిగా ఆర్‌బీఎస్‌కే!

తూతూమంత్రంగా 'రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం'

- ఏడాదికి రెండు దఫాలు అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్స్‌లో చిన్నారులకు పరీక్షలు నిర్వహించాలి
- గ్రహణం మొర్రి వంటి సమస్యలను గుర్తించాలి
- కాగితాలపైనే సేవలు
- క్షేత్రస్థాయిలో కానరాని వైనం



విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కార్యకలాపాలు సరిగా సాగడం లేదు. ఆరోగ్య శాఖ పరిధిలో ఉండే ఈ వింగ్ ఆధ్వర్యంలో గతంలో అనేక కార్యక్రమాలను నిర్వహించేవారు. కానీ, ఇప్పుడు ఆ విభాగం అనేది ఒకటుందన్న విషయం ప్రజల సంగతేమో...ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు కూడా గుర్తున్నట్టు లేదు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణ, వ్యాధులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య విభాగాన్ని ఏర్పాటుచేశారు. పుట్టిన చిన్నారుల నుంచి 18 ఏళ్లలోపు వయసు పిల్లలకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఆరోగ్యంపై అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలి. ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారుల కోసం ఏడాదికి రెండుసార్లు అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్స్‌లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేసి గ్రహణం మొర్రి వంటి సమస్యలను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలి. గతంలో ప్రత్యేక వాహనాలను ఏర్పాటుచేసి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలకు వైద్య బృందాలను పంపించి పరీక్షలు చేయించేవారు. ఇప్పుడు ఆ వాహనాలకు మంగళం పాడేయడంతో బాధ్యతలను స్థానిక పీహెచ్‌సీలకు అప్పగించారు. పీహెచ్‌సీ వైద్యులకు ఆస్పత్రుల్లో సేవలు అందించడం, ఆరోగ్య సురక్ష శిబిరాలకు వెళ్లడానికి సమయం సరిపోతోంది. ఇక, చిన్నారులకు పరీక్షించే తీరిక వారికి దొరకడం లేదు. దీంతో దీర్ఘకాలిక వ్యాధులను నిర్ధారించే కార్యక్రమం పూర్తిగా నిలిచిపోయినట్టు అయింది. కానీ, గడిచిన కొన్నాళ్ల నుంచి ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాల అమలుపై ఆరోగ్య శాఖ అధికారులు దృష్టిసారించడం లేదు.

రక్తహీనత నిర్ధారించే పరీక్షలు ఏవి..

గతంలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు రక్త హీనతను నిర్ధారించే పరీక్షలు చేసేవారు. కానీ, ఇప్పుడు ఈ పరీక్షలు చేయడం మానేశారు. ఒకపక్క ఎనీమియా ముక్త భారత్ అంటూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్న తరుణంలో రక్త హీనతను నిర్ధారించే పరీక్షలు చేయకపోవడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనివల్ల రక్తహీనతతో బాధపడే బాలికలు, చిన్నారులు సంఖ్య పెరిగిపోతోందంటున్నారు. కానీ, అధికారులు రక్త హీనత పరీక్షలు చేస్తున్నట్టు లెక్కలు చూపించుకుంటున్నారు. చిన్నారుల్లో నులి పురుగుల సమస్యను తొలగించేందుకు ఏటా రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలి. ఇందుకోసం పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ బాధ్యత కూడా ఆర్‌బీఎస్‌కే విభాగం చూసుకుంటుంది. కానీ, మొన్న ... మిగతా 4వ పేజీలో

నేటి నుంచి ఉద్యోగుల ఉద్యమం

- దశల వారీగా 27వ తేదీ వరకూ నిరసన కార్యక్రమాలు
- ప్రభుత్వం దిగిరాకుంటే మెరుపు సమ్మె
- ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు ఈశ్వరరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 13: రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం అయినందున ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణను యథావిధిగా కొనసాగించనున్నట్టు జేఏసీ చైర్మన్, ఏపీఎన్‌జీవో విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ జంక్షన్‌లోని ఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హక్కుల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లంతా బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి జిల్లా, తాలూకా కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతి పత్రాలు సమర్పిస్తారన్నారు. 15వ తేదీన అన్ని జిల్లా కేంద్రాలు, పాఠశాలల వద్ద నిరసన ప్రదర్శనలు, 17న ర్యాలీలు, ధర్నాలు, 20న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్టు తెలిపారు. 21 నుంచి 24వ తేదీ వరకు నాయకులు ... మిగతా 4వ పేజీలో

నేడు జడ్పీ సమావేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ హాలులో జరుగుతుందని సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరగనున్న సమావేశానికి జిల్లాలో అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

చేతివృత్తి కళాకారులను ప్రోత్సహించాలి


లేపాక్షి షోరూంలో వస్తువులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మహారాణిపేట, ఫిబ్రవరి 13: లేపాక్షిలో చేతివృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనిఆంధ్రప్రదేశ్ హస్త కళల కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. నగరంలోని సివెన్స్ హిల్స్ ఆస్పత్రి సమీపాన నూతన లేపాక్షి ఎంపోరియంను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆప్కో ఎంపోరియంను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖలో రెండో లేపాక్షి ఎంపోరియంను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతిజిల్లా ప్రధాన కేంద్రంలో చేతి వృత్తుల బజారులను ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి చంద్రమౌళి, మేనేజర్ కార్తీక్ విజయగౌరి, సంతోశ్, కుమార్, కృష్ణ సాయి ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాడీ లిఫ్టింగ్ పోటీలకు నగర క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 13: జాతీయస్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలకు వాయుపుత్ర హెల్త్‌క్లబ్ క్రీడాకారులు ఎంపికైనట్టు ఆంధ్రప్రదేశ్ బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రెసిడెంట్ ఎస్.ఎస్.శివశంకర్, ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వాయుపుత్ర హెల్త్‌క్లబ్ ఆవరణలో ఎంపికైన క్రీడాకారులు జి.తరుణ్‌తేజ, ఎం.సురేంద్ర, బి.మురళీకృష్ణ గోపాల్, కె.హేమంత్‌సాయి, బి.రమేష్‌లకు హీమ శంకరం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాంబమూర్తిరాజు ఆర్థిక సహాయం చేశారు. ఈ చెక్కులను చారిటబుల్ ట్రస్ట్ రవిశర్మ అందజేసి అభినందించారు. 14వ జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీలు మార్చి 3, 4 తేదీల్లో పాట్నాలో జరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ మధు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులరెడ్డి

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 13: వన్‌టౌన్ బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్య నిర్వహణాధికారిగా ఉపకమిషనర్ పి.శ్రీనివాసులురెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఈవో గా కె. శిరీష ఉపకమిషనర్ కొనసాగారు. ఈవో బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావును దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి టి.తిరుమలేశ్వరరావు, ఇంజనీరు రమణ, సహాయ ఇంజనీరు ఎస్.ఎస్.మూర్తి కలసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాదులకు లక్ష్మీనారాయణ సంఘీభావం


శిబిరంలో లక్ష్మీనారాయణ, చలసాని శ్రీనివాస్

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూ యాజమాన్య హక్కుల చట్టంపై 55 రోజులుగా కోర్టు ఆవరణలో న్యాయవాదులు పోరాటాన్ని సాగిస్తున్నారు. దీక్షకు జై భారత్ పార్టీ వ్యవస్థపకులు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మంగళవారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

కేన్సర్ కేర్ విభాగంలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని నూతనంగా ఏర్పాటు చేసిన కేన్సర్‌కేర్ విభాగంలో పలు పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. కేన్సర్ కేర్ సెంటర్, ఆంధ్ర మెడికల్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ, ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ పరిధిలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 100 పోస్టులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఈ నెల 20వ తేదీలోగా ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలనిఅధికారులు ఒక ప్రకటనలో కోరారు. వివరాలను www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలి.

విశాఖలో పలువురు ఏసీపీలకు బదిలీ

మహారాణిపేట, ఫిబ్రవరి 13: నగరంలో పలువురు ఏసీపీలకు బదిలీలు జరిగాయి. సీహెచ్‌జీవీ ప్రసాద్‌రావుకు టాస్కుఫోర్స్‌తోపాటు ఏసీబీ ఏసీపీగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్ వాసుదేవ్ విశాఖ నగర ట్రాఫిక్ ఏసీపీగా నియమితులయ్యారు. ఎం శ్రీనివాసరావు నగర సీఎస్‌బీకి బదిలీచేశారు.సీహెచ్ శ్యామలరావు విశాఖ నగర క్రైమ్ ఏసీపీగా నియమించారు. బి. సురేష్ నార్త్ ఏసీపీగా నియమితులయ్యారు.

వైభవంగా నీలమాంబ పరస ఉత్సవం

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 13: పూర్ణామార్కెట్ సమీపంలోని రంగిరీజు వీధి నీలమాంబ అమ్మవారిపరస మహోత్సవం మంగళవారం వైభంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది . టీడీపీ దక్షిణ ఇన్‌చార్జిగండిబాబ్జి పార్టీ శ్రేణులతో కలసి నీలమ్మను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పార్టీ నాయకులతో కలసి పూజలు చేశారు. సాయంత్రం పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు పైన ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 18వ తేదీన విశాఖలో నిర్వహించతలపెట్టిన శంఖారావం యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం కార్యకర్తలు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగరపువలస సమీపంలో ఆరోజు జరగనున్న శంఖారావం యాత్రకు నియోజవర్గంనుంచి సుమారు పదివేల మంది హాజరయ్యేలా జనసమీకరణ చేయాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఈ సభ పార్టీలో స్ఫూర్తిగా నిలవనుందన్నారు. ఈమేరకు ప్రజల్లో చైతన్య పరచాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తరం ఇన్‌చార్జి విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో భయాందోళనకు గురిచేయడం అన్యాయం

» టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ


సమావేశంలో మాట్లాడుతున్న గండిబాబ్జీ

మహారాణిపేట, ఫిబ్రవరి 13: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టారని ఏడేళ్లలోపు శిక్షార్హం కలిగిన ఐటీ యాక్టు కేసులపై అరెస్టులు చేసి భయాభ్రాంతులకు గురి చేయటం దారుణమని టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆందోళన వ్యక్తంచేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం విశాఖలోని మహారాణిపేట ఉంటున్న పినపాల ఉదయ భూషణ్ (68), అతని కుమారుడు చంద్రకిరణ్‌లను కడప జిల్లా పులివెందల పోలీసులు ఆకస్మాత్తుగా వచ్చి బలవంతంగా తీసుకు వెళ్లారన్నారు. వారిని ఎందుకు ఎక్కడకు తీసుకువెళ్తున్నారని భూషణ్ భార్య పరళ కుమారి ప్రశ్నించగా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టారని ఆ అభియోగంపై విచారణకు తీసుకువెళ్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారన్నారు. 68 ఏళ్ల ఉదయ భూషణ్‌కు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు చెప్పినా పట్టించుకోకుండా పోలీసులు లాక్కుపోవడం దారుణమన్నారు. ఐటీ యాక్ట్ సెక్షన్లు ప్రకారం వారు పెట్టిన పోస్టులు మూడేళ్లలోపు నేరాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఏడేళ్ల లోపు నేరాల కు 41ఏ నోటీసు ఇచ్చి విచారణ చేయాలని, కాని వారిని అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. వారికి ఏమి జరిగినా పోలీసులదే బాధ్యతని అన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఈసమావేశంలో లీగల్ సెల్ నాయకులు ఎస్.వి. రమణ శోభన్‌బాబు, సురేంద్ర, రాజశేఖర్ . పార్థసారధి, అప్పల నాయుడు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలన అవినీతిమయం

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు


మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 : వైసీపీ ప్రభుత్వ పాలన అవినీతి మయంగా సాగుతోందని మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. 46వ వార్డులో బీజేపీ అధ్యక్షుడు గార ఈశ్వరరావు ఆధ్వర్యంలో విష్ణుకుమార్ రాజు పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలివ్వకుండా చోద్యం చూస్తుందని విమర్శించారు. అవినీతిపై ఎవరైనా ప్రశ్నిస్తే జైల్లో పెట్టిస్తున్నారన్నారు. తాను బీజేపీ తరపున మళ్లీ ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నట్లు చెప్పారు.తనను గెలిపిస్తే.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా చలసాని రాఘవేంద్రరావు


చలసాని రాఘవేంద్రరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 13: అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (నాఫ్ కాబ్) డైరెక్టర్‌గా ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలోని నేషనల్ కో ఆపరేటివ్ యూనియన్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 222 ఓట్లకు గాను 211 ఓట్లతో ఆయన గెలుపొందారు.రాఘవేంద్రరావు డైరెక్టర్‌గా ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు.దేశంలో మొత్తం 1500 అర్బన్ సహకార బ్యాంకులలో వివిధ విభాగాల్లో తొలి 20 స్థానాల్లో ఉన్న విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్‌కు చైర్మన్‌గా ఉన్న ఆయనను ఇప్పుడు నాఫ్‌కాబ్ అభివృద్ధికి తోడ్పడేలా సభ్యులు ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రాఘవేంద్రరావుకు విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు మార్గదర్శకులు మానం ఆంజనేయులు, ఏపీ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, సీపీఐ రాష్ట్ర నేత జేవీ సత్యనారాయణమూర్తి, గుడివాడ భాస్కరరావు, సీఈఓ నరసింహమూర్తిఅభినందనలు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా సెంచరీ క్లబ్ నిర్వహణ

» క్లబ్ మాజీ సభ్యుడు శివాజీ

దొండపర్తి, ఫిబ్రవరి 13: నగరంలోని మహారాణిపేటలోని ఐబీపీ సెంచరీ క్లబ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్టు క్లబ్ మాజీ సభ్యుడు కె.శివాజీ ఆరోపించారు. దొండపర్తిలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ క్లబ్ 1934లో బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో దీనిని స్థాపించి, 1936లో రిజిస్ట్రేషన్ చేశారని గుర్తు చేశారు. క్లబ్‌లో నిబంధనలకు విరుద్ధంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నారన్నారు. ఈ క్రమంలో క్లబ్ సభ్యుడు ఒకరు కొద్ది రోజుల క్రితం సీతమ్మధారలో అక్రమంగా డిఫెన్స్ మద్యం నిల్వ చేసి పోలీసులకు పట్టుబడినట్టు చెప్పారు. క్లబ్‌లో అక్రమాలు ప్రశ్నించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక కార్పొరేటర్‌కు ఉచితంగా సభ్యత్వం ఇచ్చారని చెప్పారు. క్లబ్‌లో 1200 మంది వరకు సభ్యులున్నారని, గతంలో ఇక్కడ పేకాట, టెన్నిస్ పార్కుల్లో పార్కింగ్ వద్దు అనిచెప్పినందుకుఅక్రమంగా 2019లో తనను, మి త్రుడు పి.వెంకటరమణనుఅన్యాయంగా సస్పెండ్ చేశారన్నారు. క్లబ్ సభ్యులకు కార్మిక శాఖ నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. క్లబ్ నిర్వహణలో 2019 నుంచి 2022 వరకు సుమారుగా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

ఓటు హక్కుప్రాధాన్యంపై రాష్ట్రస్థాయి ప్రచారం


మాట్లాడుతున్న సిటిజన్స్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి లక్ష్మణరెడ్డి

సీతంపేట, ఫిబ్రవరి 13: సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఓటు వేద్దాం- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే నినాదంతో ఈ నెల 25 నుంచి రాష్ట్ర స్థాయి కళాజాతను నిర్వహిస్తున్నట్లు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి పల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కళాజాత విశాఖనుంచి ప్రారంభమై మార్చి 8వతేదీన కర్నూలులో ముగుస్తుందన్నారు. 10 మందితో కూడిన రాష్ట్రస్థాయి కళాబృందం నృత్య నాటికలు, గేయాలు, జానపదాలు, గజల్స్ ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లా కేంద్రాల్లో ఓటు హక్కు ప్రాధాన్యం ప్రజలకు వివరిస్తామని తెలిపారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ కె.చిన్నయ సూరి, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ బోడేపూడి ప్రసాదరావులు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రథమ వైస్ చాన్సలర్ కె.నిరూపారాణి మాట్లాడుతూ ఓటుహక్కుతో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు.

ఖైదీల పరివర్తనలో జైలు అధికారుల కీలకపాత్ర

» జైళ్ల శాఖ డీజీ హరీశ్‌కుమార్ గుప్త



మాట్లాడుతున్న డీజీ హరీశ్‌కుమార్ గుప్త

ఆరిలోవ, ఫిబ్రవరి 13: కరుడు గట్టిన నేరస్థునిలో కూడా పరివర్తన తీసుకువచ్చి తిరిగి పరిపూర్ణ మనిషిగా తీర్చిదిద్దడంలో జైలు అధికారుల కీలక పాత్ర పోషిస్తున్నారని జైళ్ల శాఖ డీజీ జి. హరీశ్‌కుమార్ గుప్త అన్నారు. ఆయన మంగళవారం ఉదయం విశాఖ కేంద్రకారాగారంలో ప్రారంభించిన పునశ్చరణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్‌లో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారిన నూతన టెక్నాలజీని ఉపయోగించి జైళ్లను ఎలా అభివృద్ధి చేయాలో అధికారులకు సూచించారు. అనంతరం ఆయన జైళ్లకు శాఖకు సంబంధించిన సోషల్ మీడియా అకౌంట్స్‌లో భాగంగా యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్ బుక్ ఇనాస్ట్రా గ్రామ్‌లను డీజీ లాంఛనంగా విడుదల చేశారు. 2024కు సంబంధించి కారాగార శాఖ డైరీతో పాటు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన సోషియాలజీ ప్రొఫెసర్ శ్రీ మన్నారాయణ మూర్తి మాట్లాడారు. గుంటూరు రేంజ్ జైళ్ల శాఖ ఉపశాఖాధికారి ఎంవరప్రసాద్, కోస్తా ఆంధ్రా రాజమహేంద్రవరం జైళ్ల ఉప శాకాధికారి ఎంఆర్ రవికిరణ్ ఫైనాన్స్ ఆఫ్‌ది ప్రిజన్స్‌పై వివరించారు. విశాఖ కేంద్ర కారాగార సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ నిర్వహించిన ఈ కార్య క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైళ్ల అధికారులు పాల్గొన్నారు.

పాత పింఛన్ పునరుద్ధరించాలి

కంచరపాలెం, ఫిబ్రవరి 13 : పాత పెన్షన్ స్కీంను రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని అమలు తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. ఓపీఎస్ సాధనకు ఈనెల 16న చేపట్టనున్న సమ్మెలో కార్మికులంతా ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు స్థానిక బొట్టా నరసింగరావు భవన్‌లో మంగళవారం జరిగిన సెమినార్‌లో కుమార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు చివరికి రక్షణ రంగంలో కూడా ప్రైవేటీకరణను తీసుకువచ్చి దేశ భద్రతను ప్రమాదంలో నెడుతోందన్నారు. డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షులు శ్రీనివాస్, నాగార్జున, అరుణ్, చిట్టిరాజు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు ఆత్మీయ సత్కారం

సీతమ్మధార, ఫిబ్రవరి 13 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణులు రుణపడి ఉంటారని నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లారావు అన్నారు. ఈ మేరకు స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయనకు నాయీబ్రాహ్మణ స భ్యులు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు పుల్లారావుకు అభినందనలు తెలిపారు. డైరెక్టర్ వెంపడపు నూకరాజు, సభ్యులు ఆతవ సుబ్బారావు, గణేష్, గణపతి పాల్గొన్నారు.

నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు గృహ నిర్బంధం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 : నగరంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్‌ను పోలీసులు మంగళవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఆయన స్వగృహం వద్ద నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులకు తమ సమస్యలు చెప్పకపోతే ఇంకెవరికి చెప్పాలని ప్రశ్నించారు.

ఆశీల వసూలు సిబ్బంది తొలగింపు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 13: పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలు చేస్తున్న తమను విధుల్లో తొలగించడంపై ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆ వేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు వారు జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ, జోన్4 అధికారులకు వినతి పత్రాలులు అందజేశారు. గత30 ఏళ్లుగా ఆశీలు వసూళ్ల ఉద్యోగంపై ఆధారపడిన పెద్దాడ నాగేశ్వరరావు తనను తొలగించడంపై కన్నీరుమున్నరవుతున్నారు. తనతో పాటు వి.కాశీబాబు ఆశీలు వసూలు చేసే ఉద్యోగిని ముందస్తు సచారంలేకుండా తొలగించారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. తిరిగివిధుల్లోచేర్చుకుని తమకు న్యాయం చేయాలని అధికారులను అభ్యర్థించారు.

శ్రీవిశ్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో శ్రీవిశ్వ కళాశాల అధ్యాపకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్‌లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. విశాఖ శ్రీవిశ్వ విద్యాసంస్థలో చదువుతున్న జాగరపు శ్రావ్య 99.80, పి. ఓంకార్‌సాయిరాయుడు 99.76, జె.శ్రావ్యశ్రీ 99.76, ఎం.యశస్వి 99.64, డి.నవదుర్గశ్రీనితీష్ 99.36, ఆర్.హేమంత్ 99.28, జి.జ్యోతి కిరణ్ 99.21, ఎం.కీర్తన 99.19, జి.వినయ్ 99.10 పర్సంటైల్ సాధించారు. 99 పర్సంటైల్‌పైగా 9మంది, 98 పర్సంటైల్ పైగా 24 మంది సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీవిశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ విద్యార్థులు, సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సభ్యులను, అభినందించారు.

సీఎం సభకు బస్సుల తరలింపుతో పాట్లు

అక్కయ్యపాలెం/జగదాంబ కూడలి, ఫిబ్రవరి 13 : నగరంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడల ముగింపు సభకు జనాలను ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. ఒక్కో వార్డులో 6 నుంచి 8 బస్సులను వైసీపీ నాయకులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. బస్టాపుల్లో గంటల కొద్దీ వేచి నిరీక్షించాల్సి వచ్చింది. విద్యార్థులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా మంది ఆటోలను ఆ శ్రయించారు.

ప్రయాణికులతో ఆడుకున్నారు

... 3వ పేజీ తరువాయి


సీఎం సభకు బస్సులో జనాల తరలింపు

జనాలను తరలించేందుకు నగరంలో వార్డుకు ఐదు నుంచి ఎనిమిది బస్సులు చొప్పున కేటాయించారు. జనసమీకరణ బాధ్యతలను డ్వాక్రా గ్రూపుల ఆర్‌పీలకు అప్పగించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఈ బస్సులు బయలుదేరాల్సి ఉండగా చాలాచోట్ల ఎవరూ ముందుకు రాలేదు. దాంతో గ్రూపు సభ్యులకు ఆర్పీలు ఫోన్లు చేసి తప్పనిసరిగా రావాల్సిందేనని చెప్పారు. అయినా ఎవరూ స్పందించకపోవడంతో బెదిరింపులకు దిగారు. ప్రస్తుతం రుణమాఫీ కార్యక్రమం జరుగుతోందని, సీఎం సభకు రానివారికి ఆ పత్రాలపై సంతకాలు చేయబోమని హెచ్చరించారు. బస్సులో వచ్చిన వారికే రుణ మాఫీ జరుగుతుందని స్పష్టంచేశారు. దాంతో మహిళలు కొంతమంది తిట్టుకుంటూనే బస్సులు ఎక్కారు. అయినా చాలా బస్సులు పది నుంచి పదిహేను మందితోనే బయలుదేరి వెళ్లాయి. ఉత్తర నియోజకవర్గంలో సభకు తీసుకువెళ్లే మహిళల కోసం పోర్టు స్టేడియంలో బిర్యానీ తయారు చేయించి, ప్యాకెట్లు కట్టి పంపిణీ చేశారు. అయితే సీఎం జగన్ సాయంత్రం ఆరు గంటలకు వస్తారని, రాత్రి ఎనిమిది గంటల వరకు ఉండాలని అక్కడికి వెళ్లాక తెలియడంతో చాలా మంది ఆయన రాక ముందే తిరుగు ముఖం పట్టారు. వెళ్లిన బస్సులో వచ్చే అవకాశం లేకపోవడంతో సొంత డబ్బులు పెట్టుకొని ఆటోలలో ఇళ్లకు చేరుకున్నారు. ఇలా మహిళలు వెళ్లిపోతున్నారని గమనించిన నిర్వాహకులు స్టేడియంలో గేట్లకు తాళాలు వేసేశారు.

ప్రజల ఇక్కట్లు: విశాఖపట్నం రీజియన్‌లో ఆర్టీసీకి 820 బస్సులు ఉన్నాయి. వాటిలో 230 బస్సులు సీఎం సభకు కేటాయించడంతో చాలా రూట్లలో ఉదయం నుంచే బస్సులు రద్దయ్యాయి. ఈ విషయం తెలియక రెగ్యులర్‌గా ఆ మార్గాల్లో ప్రయాణించేవారు బస్సుల కోసం బస్టాపులో గంటల తరబడి నిరీక్షించారు. ఎంతకీ బస్సులు రాకపోవడంతో విషయం తెలుసుకుని కొందరు ఆటోలను ఆశ్రయించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, గురుద్వారా, అక్కయ్యపాలెం, గాజువాక, సింహాచలం, పోస్టాఫీసు జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

జేఈఈ మెయిన్స్ మెరుపులు

... 3వ పేజీ తరువాయి

తిరుపతిరావు గజపతినగరంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 7.15 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకూ సుమారు 14 గంటలపాటు చదువుకు కేటాయించేవాడిని

రోజుకు 16 గంటలు చదివేవాడిని

- కోరుప్రోలు రాకేష్, 99.978 పర్సంటైల్ విద్యార్థి

సొంతూరు విశాఖపట్నం. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు శ్రీచైతన్య విద్యాసంస్థలలో చదివాను. టెన్త్‌లో 590 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో 99.978 పర్సంటైల్ సాధించడం సంతోషంగా ఉంది. మరింత మెరుగైన పర్సంటైల్ కోసం ఏప్రిల్‌లో జరగనున్న సెకండ్ సెషన్ పరీక్షలకు హాజరవుతా. తరువాత ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించడం ద్వారా ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరాలన్నదే లక్ష్యం. రోజుకు 16 గంటలపాటు చదివాను. నాన్న సతీష్ ఆయుర్వేద వ్యాపారం చేస్తారు. ఐఐటీలో చదివిన మా మేనమామే స్ఫూర్తి.

ఓటర్ల జాబితాలో అవకతవకలు

... 3వ పేజీ తరువాయి

వస్తుందని, తప్పుచేసిన అధికారులపై చర్యలు ఉంటాయని బండారు స్పష్టంచేశారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ కలెక్టర్ మల్లికార్జున హయాంలో జరిగిన కుంభకోణాలకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని అన్నారు. అక్రమంగా ఓట్లు చేర్చుతున్నారని అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 90 బూత్‌లలో పలు వీధుల్లో ఒక్కొక్కరికి రెండు నుంచి నాలుగు ఓట్లు ఉన్నాయన్నారు. గతంలో రెవెన్యూ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు చక్కగా చేసేవారని, ఇప్పుడు సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించిన తరువాత తప్పులు వచ్చాయన్నారు. ఇదే విషయం చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ నిర్లక్ష్యంపై తక్షణమే ఎన్నికల సంఘం విచారణ చేపట్టాలని లేకపోతే కోర్టును ఆశ్రయిస్తామని వెలగపూడి స్పష్టంచేశారు.

నేటి నుంచి ఉద్యోగుల ఉద్యమం

... 3వ పేజీ తరువాయి

జిల్లా పర్యటనలు చేసి ఉద్యోగు లను జాగృతం చేస్తారని తెలిపారు. ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామ న్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే ఏ క్షణానైనా మెరుపు సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్టీసీ జోనల్ సెక్రటరీ ఎంవీఆర్ మూర్తి, ఎస్.సత్తిబాబు, అప్పలరాజు, టి.గోపాలకృష్ణ, రామకృష్ణ, ఆర్.రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ఆర్‌బీఎస్‌కే!

... 3వ పేజీ తరువాయి

జరిగిన ఆల్బండజోల్ మాత్రలు పంపిణీ స్కూల్స్‌లో మాత్రమే నిర్వహించారు. అది కూడా స్కూల్ యాజమాన్యాలకు అప్పగించి అధికారులు చేతులు దులుపుకున్నారు. అదే రోజు ఆశ కార్యకర్తలు సమ్మెలో ఉన్నారు. ఆశించిన స్థాయిలో మాత్రలు పంపిణీ జరగలేదు. కానీ, అధికారులు మాత్రం ఈ నెల తొమ్మితో తేదీన నిర్వహించిన మాత్రల పంపిణీ కార్యక్రమం 97 శాతం మేర పూర్తయినట్టు ప్రకటించారు. ఇలా, ఆర్‌బీఎస్ ప్రోగ్రామ్స్‌ను అమలు చేస్తున్నట్టు లెక్కల్లో చూపిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కానరావడం లేదు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చూపిస్తాం

» రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్


మాట్లాడుతున్న మాణిక్యం ఠాగూర్

పెందుర్తి (విశాఖపట్నం), ఫిబ్రవరి 13: రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో గల క్రియాశీలక కార్యకర్తలతో మంగళవారం ఆయన సుజాతనగర్‌లోని ఇంద్రాణి ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాణిక్యం ఠాగూర్ మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగిందన్నారు. పార్టీ పటిష్టానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఇందుకు పార్టీ గ్రామ, బూత్, జిల్లా స్థాయి కమిటీలు శ్రమించాలన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు గొంప గోవింద్, బొడ్డు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, విజయనగరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శరగడం రమేశ్‌కుమార్, జిల్లా పార్టీ నేతలు కొయ్యి ప్రసాదరెడ్డి, వేగి దివాకర్, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి రమేశ్‌నాయుడు, విన్నకోట రాము పాల్గొన్నారు.

భద్రతా ఆడిట్, నిర్మాణ పనులపై డీఆర్‌ఎం సమీక్ష

విశాఖపట్నం, ఫిబ్రవరి 13: డివిజన్ పరిధిలోని పలు స్టేషన్‌లో మంగళవారం డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ పర్యటించి భద్రతా ఆడిట్, అభివృద్ధి నిర్మాణ పనులపై సమీక్షించారు. ముందుగా శ్రీకాకుళం, విజయనగరం మధ్య గల మూడు (త్రీ) లెవెల్స్ క్రాసింగ్ గేట్ల వద్ద ఇంటర్ లాకింగ్ పనులను పరిశీలించి అక్కడి సిబ్బందితో మాట్లాడి భ ద్రతా నియమాలపై సమీక్షించారు. అక్కడ నుంచి విండో ట్రయిలింగ్ ద్వారా కొత్తవలస స్టేషన్‌కు చేరుకుని తనిఖీలు చేశారు. తర్వాత నౌపడ స్టేషన్ వద్ద యార్డు లేఅవుట్, బ్యాటరీ గది, రిలే రూమ్‌లతో పాటిస్తున్న భద్రతా చర్యలను తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంధం శ్రీనివాస్

ఆస్తి పన్ను పెంపు ప్రతిపాదనను విరమించుకోవాలి

టీడీపీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఫిబ్రవరి 13: జీవీఎంసీలో ఆస్తి పన్ను పెంపు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోకపోతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జీవీఎంసీని ముట్టడిస్తామని 76, 67 వార్డుల కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావులు హెచ్చరించారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ మేరకు అభివృద్ధి చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ పరిపాలనా రాజధాని అని చెప్పి కబ్జాలే తప్పా ఎక్కడా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఈ సమావేశంలో సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు శివప్రసాద్, అనంత్, వాసు, పోలరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యమాంబ పరస

ఆటోనగర్, ఫిబ్రవరి 13: జీవీఎంసీ 70వ వార్డు ప్రజల ఆరాధ్య దైవం సత్యమాంబ అమ్మవారి పరసను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అమ్మవారికి అర్చకులు పూజలు, అభిషేకాలు చేశాక ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పూజల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, టీడీపీ-జనసేన నాయకులు కేవీఎస్ శంకరరావు, చట్టి గోపి, పీబీఎల్ మూర్తి, లంక మురళీదేవి, సూరిబాబు, చిరంజీవి, జోజి, సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల పరస

అక్కిరెడ్డిపాలెం: ప్రతి సంవత్సరం మాదిరిగా బుధవారం హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సీతారాముల పరసను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని సీతారామ మందిరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు కాలనీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వంగలపూడి గోపి తెలిపారు.

ఘనంగా ప్రపంచ రేడియో దినోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 13: స్థానిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీనగర్ సమీపంలో గల ప్రసారభారతి ఆకాశవాణి రేడియో స్టేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామచంద్రారెడ్డిని సత్కరించారు. అనంతరం కమిటీ ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక స్థితిగతులు, సాంస్కృతిక, రైతు సంక్షేమం, ఆరోగ్యం, వాతావరణం గెరించి ప్రజలకు తెలియజేయడంలో రేడియో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బి.సత్యనారాయణ, ఎం.వెంకటరమణ, కె.తాతారావు, యశోదకృష్ణ, సిబ్బంది శ్రీనివాసరావు, సీతారామరాజు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కేవీలో అడ్మిషన్లను పునరుద్ధరించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 13: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఒకటి, ప్లస్1 తరగతుల్లో అడ్మిషన్లను పునరుద్ధరించాలని కోరుతూ 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు స్టీల్‌ప్లాంట్ సీఎండీకి లేఖ రాశారు. నూతన విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. కేవీలో అడ్మిషన్లను నిలిపివేయడం వల్ల అనేక వర్గాల ప్రజలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఇబ్బందులు పడతారన్నారు. పాఠశాలలో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని, విద్యా బోధన పెంపునకు కృషి చేయాలన్నారు.

సినిమా గైడ్

- **ఈగెల్ :** జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శరత్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఈగెల్ :** మెలోడి, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం),
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** సంగం, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 20, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 44, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 18, క్యారెట్ 24, దొండకాయలు 34, బంగాళదుంపలు 15, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 70, బరబాటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 30, కంద 54, దేముడుచిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	117
ఫారం ధర	--	137
విత్ స్కిన్	--	244
స్కిన్‌లెస్	--	254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..


మాక్ డ్రిల్‌లో భాగంగా లీకైన గ్యాస్‌ను ఆర్పుతున్న దృశ్యం


అస్వస్థతకు గురైన వ్యక్తిని సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తూ..

ఉత్కంఠభరితంగా మాక్ డ్రిల్

గ్యాస్ రికవరీ ప్లాంట్-2లో నిర్వహించిన ఉక్కు యాజమాన్యం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 13: పరిశ్రమల్లో జరిగే ప్రమాద సమయంలో ఉద్యోగులు, కార్మికులను అప్రమత్తం చేసేలా మంగళవారం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జీఆర్‌పీ (గ్యాస్ రికవరీ ప్లాంట్)-2లో మాక్ డ్రిల్ నిర్వహించింది. అయితే ఇది మాక్ డ్రిల్ అని తెలియక తొలుత కార్మికులందరూ కాస్త భయాందోళనకు గురయ్యారు. ఆ తర్వాత మాక్ డ్రిల్ అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఆపద సమయంలో ఏ విధంగా బయటపడాలో మాక్ డ్రిల్ ద్వారా సీఐఎస్ఎఫ్ సిబ్బంది వివరించారు. జీఆర్‌పీ విభాగంలో విధి నిర్వహణలో ఉండగా ఫ్యాబ్రిక్ కాంపెన్సేటర్ నుంచి ఎల్‌డీ గ్యాస్ లీక్ అయితే ఏ విధంగా ప్రమాదం నుంచి బయటపడాలో కళ్లకు కట్టినట్టు వారు చూపించారు. అత్యవసర సమయంలో ఏ విధంగా వ్యవహరించాలి, ఎటువంటి సామగ్రిని ఉపయోగిస్తే ప్లాంట్‌కు, ఎవరికీ ప్రాణ నష్టం జరగకుండా ఎలా బయటపడవచ్చో సవివరంగా తెలియజేశారు. ఈ మాక్ డ్రిల్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేశ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పి.చిన్నారావు, స్టీల్‌ప్లాంట్ సీజీఎం (సర్వీసెస్) ప్రవీణ్‌కుమార్, సీఐఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.


బంక్ కూడలిలోని సభా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

19న లోకేశ్ శంఖారావం సభ

సభాస్థలిని పరిశీలించిన గణబాబు

గోపాలపట్నం, ఫిబ్రవరి 13: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభ ఈ నెల 19న ఇక్కడి పెట్రోల్ బంక్ కూడలిలో జరగనున్నది. ఈ మేరకు మంగళవారం సంత ప్రాంగణానికి ఆనుకుని ఉన్న స్థలంలో జరగనున్న శంఖారావం కార్యక్రమ ఏర్పాట్లను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు. సభకు తరలివచ్చే కార్యకర్తలకు సౌకర్యాలు ఏ విధంగా కల్పించాలి, సభ నిర్వహణ, తదితర అంశాలపై టీడీపీ నాయకులతో చర్చించారు. శంఖారావం సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.


గాజువాక సమతానగర్‌లో ప్రజల కోసం సిద్ధం చేసిన బస్సు


ఎన్ఎస్‌టీఎల్ డబుల్ రోడ్డులో జనాల తరలింపునకు సిద్ధంగా..


ఎన్ఏడీ బస్టాప్‌లో ఆర్టీసీ సర్వీసుల కోసం వేచివున్న ప్రయాణికులు

సీఎం సభకు బస్సులు-ప్రయాణికులకు తప్పని తిప్పలు

జనాల తరలింపునకు నానాపాట్లు పడిన వైసీపీ శ్రేణులు
కొద్దిమందితోనే స్టేడియానికి చేరుకున్న బస్సులు
ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో లేక ఆటోలను ఆశ్రయించిన ప్రజలు, విద్యార్థులు

గాజువాక, ఫిబ్రవరి 13: పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమానికి జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను కేటాయించడంతో ఇతర ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గమ్య స్థానాలకు చేరుకునేందుకు బస్సుల కోసం ఎంతసేపు వేచివున్నా అవి రాకపోవడంతో అనేకమంది ప్రయాణికులు చేసేది లేక ఆటోలను ఆశ్రయించారు. బస్ పాసులున్నా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చిందని పలువురు ప్రయాణికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సీఎం జగన్ హాజరయ్యే ఈ ముగింపు కార్యక్రమానికి బస్సుల్లో జనాలను తరలించేందుకు వైసీపీ నాయకులు, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది నానాపాట్లు పడ్డారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతం నుంచి ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేసిన బస్సులు చాలా వరకు ఖాళీగానే వెళ్లాయి. పలువురు ఆర్పీలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి 'ఆడుదాం ఆంధ్రా'కు రావాలని కోరినా ఎవరూ ఆసక్తి చూపలేదు.


సీఎం సభకు బస్సులో వెళ్లేందుకు సిద్ధమైన ఆర్పీలు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది

ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట: ఆడుదాం ఆంధ్రా ముగింపు సభకు 52, 90 వార్డుల నుంచి జనాన్ని తరలించేందుకు కాలనీల వారీగా బస్సులను కేటాయించినా వెళ్లేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. మధ్యాహ్నం రెండున్నర దాటిని ఆయా బస్సులు ఖాళీగానే కనిపించాయి. 93, 94 వార్డులకు సంబంధించి వార్డుకు తొమ్మిది బస్సుల చొప్పున జనాల తరలించాలని నాయకులకు, అధికారులకు వైసీపీ పెద్దలు ఆదేశాలు జారీ చేశారు. ప్రహ్లాదపురం, దుర్గానగర్, కృష్ణానగర్, శ్రీనివాసనగర్, వేపగుంట జోనల్ కార్యాలయం, బీసీ కాలనీ, పురుషోత్తపురం, కృష్ణరాయపురం ప్రాంతాల్లో బస్సులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలకు సింహాచలం డిపో నుంచి 50 బస్సులు మాత్రమే కేటాయించినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. అధిక సంఖ్యలో యువతను తరలించాలన్న ఆదేశాల మేరకు ఆర్పీలు, కో-ఆర్డినేటర్లు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. కాగా సీఎం జగన్ పాల్గొనే ఈ కార్యక్రమం కోసం ఆర్టీసీ బస్సులను కేటాయించడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. బస్టాపుల్లో గంటలకొద్దీ వేచివున్నా బస్సులు రాకపోయేసరికి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

కూర్మన్నపాలెం: సీఎం జగన్ సభకు ఆర్టీసీ బస్సుల్లో ప్రజలను తరలించడానికి వైసీపీ శ్రేణులు అష్టకష్టాలు పడ్డారు. ఎప్పుడు పడితే అప్పుడు ఇటువంటి సభలకు రావాలంటే ఇంట్లో ఒప్పుకోవడం లేదని పలువురు వ్యాఖ్యానించారు. ఈ సభకు వెళ్లేందుకు మహిళలు ఆసక్తి చూపకపోవడంతో డ్వాక్రా మహిళలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో అరకొరగా బస్సుల్లో వెళ్లాల్సివచ్చిందని పలువురు వైసీపీ నాయకులే మాట్లాడుకున్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ప్రజలు తక్కువ సంఖ్యలో తరలివెళ్లారు. జనాల తరలింపు కోసం స్థానిక నాయకులు పడరాని పాట్లు పడ్డారు. ఇక్కడి ఏడు వార్డుల నుంచి అంతంతమాత్రంగానే ప్రజలు వెళ్లారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

మల్కాపురం, ఫిబ్రవరి 13: కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఈ నెల 16న చేపడుతున్న కార్మిక సమ్మెను అందరూ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. శ్రీహరిపురం జీవీఎంసీ మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో 58, 59, 60 వార్డుల మునిసిపల్ కార్మికులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, మునిసిపల్ యూనియన్ నాయకులు కె.రమణ, జి.రాంబాబు, బి.సూరిబాబు, ఎస్.ఆదినారాయణ, వి.రాము, దేవి, వి.బాబు, తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, తదితరులు

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కార్మిక సమ్మెను సక్సెస్ చేయాలని కోరుతూ ఇంటక్, టీఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటక్ ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, ఏఐటీయూసీ 'పశ్చిమ' నాయకుడు సత్యాంజనేయ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ అన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, రాంబాబు, పి.భూలోకరాజు, తదితరులు పాల్గొన్నారు.


పుష్కరిణి పనులకు సోమవారం శంకుస్థాపన చేసిన మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే


గతనెల పుష్కరిణి పనులకు పూజ, శంకుస్థాపన చేశాక మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఇదేం చోద్యం!

ఒకే అభివృద్ధి పనులకు రెండుసార్లు శంకుస్థాపన చేయడమా?
ఎమ్మెల్యే ఒకసారి.. మంత్రి మరోసారి చేయడంపై విమర్శలు

పెందుర్తి, ఫిబ్రవరి 13: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ ఒకే పనికి రెండుసార్లు శంకుస్థాపన చేసి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నారు. ఈ క్రమంలో పెందుర్తి వెంకటాద్రి శిఖరం దిగువన రూ.కోటితో చేపట్టనున్న పుష్కరిణి పనులకు రెండుసార్లు శంకుస్థాపన చేశారు. మంగళవారం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పుష్కరిణి పనులకు శిలఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. కాగా ఇవే పనులకు గతనెల 14న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప‌రాజ్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేయడం గమనార్హం. ఇలా ఒకే పనికి రెండుసార్లు శంకుస్థాపన చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల 97వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లో గత నెలలో రూ.రెండు కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేయగా, అవే పనులకు వారం రోజుల ముందుగానే కార్పొరేటర్ శేనాపతి వసంత శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. తాజాగా పుష్కరిణి పనులకు మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. మహా కామేశ్వరి సహిత ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయ సమీపంలో ప్రభుత్వం మంజూరు చేసిన బ్రాహ్మణ వేద పాఠశాల, సామాజిక భవనానికి చెందిన స్థలంలో వెంకటాద్రి ఆలయ వర్గాలు పుష్కరిణి పనులు చేపడుతున్నారంటూ మహా కామేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ యజ్ఞేశ్వర చైనులు ఇటీవల ఆరోపణలు చేసిన నేపథ్యంలోనే ఈ పనులకు దేవదాయ శాఖ మంత్రితో రెండోసారి శంకుస్థాపన చేయించారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు గృహ నిర్బంధం


హౌస్ అరెస్టులో ఉన్న సర్వసిద్ధి అనంతలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 13: ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి సీఎం జగన్ వచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సరసిద్ధి అనంతలక్ష్మిని గృహ నిర్బంధం చేశారు. ఈ మేరకు ఉదయం అక్కిరెడ్డిపాలెంలో ఉంటున్న అనంతలక్ష్మి ఇంటికి ముగ్గురు పోలీసులు వచ్చి హౌస్ అరెస్టు చేస్తున్నట్టు తెలిపారు. తనకు కొన్ని ముఖ్యమైన పనులు ఉన్నాయని చెప్పినప్పటికీ బయటకు పంపేందుకు పోలీసులు నిరాకరించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి విశాఖ వచ్చినప్పుడల్లా ప్రతిపక్ష నాయకులను గృహ నిర్బంధం చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి నాయకులకు రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆమె పేర్కొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్


మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 13: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వైసీపీ అరాచక పాలనకు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కోరారు. 87వ వార్డు రాజులపాలెంలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు కృషి చేయాలన్నారు. రామరాజ్యం కావాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. బటన్ నొక్కుతూ దానినే అభివృద్ధి అనుకునే సీఎం జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అభివృద్ధి అంటే ప్రకృతి సంపదను దోచుకోవటం-దాచుకోవడం, ఆస్తులను తాకట్టు పెట్టడం కాదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్రె రాంబాబు, రాజన్ రాజు, ప్రగడ దానయ్య, కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్టు


నిందితులు కె.రాజు, ఆనంద్, సీహెచ్ రాజు

గాజువాక, ఫిబ్రవరి 13: నడిచి వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును తెంచుకుపోయిన ముగ్గురు యువకులను గాజువాక క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొందేశివానిపాలెంలో గతనెల 24న షియా ప్రసాద్ సింగ్ అనే 84 ఏళ్ల వృద్ధురాలు నడిచి వెళ్తుండగా పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన కంబాల రాజు, చేపల ఆనంద్, హనుమంతవాకకు చెందిన చిరుపాటి రాజులు ఆటోలో వచ్చి ఆమె మెడలో ఉను బంగారు చైనును తెంపడంతో పాటు నగదును కూడా బలవంతంగా లాక్కుని ఆటోలో పరారయ్యారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి బంగారు గొలుసు, ఇనుప రాడ్డు, ఆటో, మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నిందితులు చోరీ చేసిన బంగారాన్ని కొనుగోలు చేసిన జాలరిపేటకు చెందిన సీహెచ్ యల్లాజీ అనే వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.


నిర్వాహకులతో మాట్లాడున్న ఏసీపీ నరసింహమూర్తి

ఘనంగా పైడిమాంబ పరస

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 13: బుచ్చిరాజుపాలెం పరిసర 16 గ్రామాల ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి పరసను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు చేశారు. వందలాది మంది భక్తులు పైడిమాంబను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో పీఎస్ఆర్ మూర్తి, అనువంశిక ధర్మకర్త పి.ప్రకాశ్‌రెడ్డి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో వాయిదా పడిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఇదిలా ఉండగా సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిలిపివేశారు. ఏటా భారీ ఎత్తున పలు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఆడుదాం ఆంధ్రా ముగింపు సభకు విచ్చేసిన జగన్ రాత్రి ఎన్ఏడీ మీదుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లనున్నందున సాంస్కృతిక కార్యక్రమాలను నిలిపివేసి, మర్నాడు చేసుకోవాలని ఏసీపీ ఎ.నరసింహమూర్తి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నిర్వాహకులకు తెలిపారు. ఇప్పటికే స్టేజీల ఏర్పాట్లు జరిగిపోయాయని నిర్వాహకులు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. సీఎం వెళ్లే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఏసీపీ చెప్పడంతో నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను బుధవారం సాయంత్రానికి వాయిదా వేశారు. సీఎం పర్యటన కోసం పండగ కార్యక్రమాలను అడ్డుకోవడం శోచనీయమని టీడీపీ నాయకులు మండి పడుతున్నారు.

చేతివృత్తి కళాకారులను ప్రోత్సహించాలి


లేపాక్షి షోరూంలో వస్తువులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మహారాణిపేట, ఫిబ్రవరి 13: లేపాక్షిలో చేతివృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనిఆంధ్రప్రదేశ్ హస్త కళల కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. నగరంలోని సివెన్స్ హిల్స్ ఆస్పత్రి సమీపాన నూతన లేపాక్షి ఎంపోరియంను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆప్కో ఎంపోరియంను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖలో రెండో లేపాక్షి ఎంపోరియంను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతిజిల్లా ప్రధాన కేంద్రంలో చేతి వృత్తుల బజారులను ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి చంద్రమౌళి, మేనేజర్ కార్తీక్ విజయగౌరి, సంతోశ్, కుమార్, కృష్ణ సాయి ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాడీ లిఫ్టింగ్ పోటీలకు నగర క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 13: జాతీయస్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలకు వాయుపుత్ర హెల్త్‌క్లబ్ క్రీడాకారులు ఎంపికైనట్టు ఆంధ్రప్రదేశ్ బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రెసిడెంట్ ఎస్.ఎస్.శివశంకర్, ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వాయుపుత్ర హెల్త్‌క్లబ్ ఆవరణలో ఎంపికైన క్రీడాకారులు జి.తరుణ్‌తేజ, ఎం.సురేంద్ర, బి.మురళీకృష్ణ గోపాల్, కె.హేమంత్‌సాయి, బి.రమేష్‌లకు హీమ శంకరం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాంబమూర్తిరాజు ఆర్థిక సహాయం చేశారు. ఈ చెక్కులను చారిటబుల్ ట్రస్ట్ రవిశర్మ అందజేసి అభినందించారు. 14వ జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీలు మార్చి 3, 4 తేదీల్లో పాట్నాలో జరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ మధు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులరెడ్డి

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 13: వన్‌టౌన్ బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్య నిర్వహణాధికారిగా ఉపకమిషనర్ పి.శ్రీనివాసులు రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఈవో గా కె. శిరీష ఉపకమిషనర్ కొనసాగారు. ఈవో బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావును దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి టి.తిరుమలేశ్వరరావు, ఇంజనీరు రమణ, సహాయ ఇంజనీరు ఎస్.ఎన్.మూర్తి కలసి పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాదులకు లక్ష్మీనారాయణ సంఘీభావం


శిబిరంలో లక్ష్మీనారాయణ, చలసాని శ్రీనివాస్

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూ యాజమాన్య హక్కుల చట్టంపై 55 రోజులుగా కోర్టు ఆవరణలో న్యాయవాదులు పోరాటాన్ని సాగిస్తున్నారు. దీక్షకు జై భారత్ పార్టీ వ్యవస్థపకులు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మంగళవారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

కేన్సర్ కేర్ విభాగంలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని నూతనంగా ఏర్పాటు చేసిన కేన్సర్‌కేర్ విభాగంలో పలు పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. కేన్సర్ కేర్ సెంటర్, ఆంధ్ర మెడికల్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ, ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ పరిధిలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 100 పోస్టులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఈ నెల 20వ తేదీలోగా ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలనిఅధికారులు ఒక ప్రకటనలో కోరారు. వివరాలను www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలి.

విశాఖలో పలువురు ఏసీపీలకు బదిలీ

మహారాణిపేట, ఫిబ్రవరి 13: నగరంలో పలువురు ఏసీపీలకు బదిలీలు జరిగాయి. సీహెచ్‌జీవీ ప్రసాద్‌రావుకు టాస్క్‌ఫోర్స్‌తోపాటు ఏసీబీ ఏసీబీగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్ వాసుదేవ్ విశాఖ నగర ట్రాఫిక్ ఏసీపీగా నియమితులయ్యారు. ఎం శ్రీనివాసరావు నగర సీఎస్‌బీకి బదిలీచేశారు.సీహెచ్ శ్యామలరావు విశాఖ నగర క్రైమ్ ఏసీపీగా నియమించారు. బి. సురేష్ నార్త్ ఏసీపీగా నియమితులయ్యారు.

వైభవంగా నీలమాంబ పరస ఉత్సవం

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 13: పూర్ణామార్కెట్ సమీపంలోని రంగిరీజు వీధి నీలమాంబ అమ్మవారిపరస మహోత్సవం మంగళవారం వైభంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది . టీడీపీ దక్షిణ ఇన్‌చార్జిగండిబాబ్జి పార్టీ శ్రేణులతో కలసి నీలమ్మను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పార్టీ నాయకులతో కలసి పూజలు చేశారు. సాయంత్రం పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు పైన ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

▸▸ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 18వ తేదీన విశాఖలో నిర్వహించతలపెట్టిన శంఖారావం యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం కార్యకర్తలు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగరపువలస సమీపంలో ఆరోజు జరగనున్న శంఖారావం యాత్రకు నియోజవర్గంనుంచి సుమారు పదివేల మంది హాజరయ్యేలా జనసమీకరణ చేయాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఈ సభ పార్టీలో స్ఫూర్తిగా నిలవనుందన్నారు. ఈమేరకు ప్రజల్లో చైతన్య పరచాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తరం ఇన్‌చార్జి విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో భయాందోళనకు గురిచేయడం అన్యాయం

▸▸ టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న గండిబాబ్జీ

మహారాణిపేట, ఫిబ్రవరి 13: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టారని ఏడేళ్లలోపు శిక్షార్హం కలిగిన ఐటీ యాక్టు కేసులపై అరెస్టులు చేసి భయాభ్రాంతులకు గురి చేయటం దారుణమని టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆందోళన వ్యక్తంచేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం విశాఖలోని మహారాణిపేట ఉంటున్న పినపాల ఉదయ భూషణ్ (68), అతని కుమారుడు చంద్ర కిరణ్‌లను కడప జిల్లా పులివెందల పోలీసులు ఆకస్మాత్తుగా వచ్చి బలవంతంగా తీసుకు వెళ్లారన్నారు. వారిని ఎందుకు ఎక్కడకు తీసుకువెళ్తున్నారని భూషణ్ భార్య పరళ కుమారి ప్రశ్నించగా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టారని ఆ అబియోగంపై విచారణకు తీసుకువెళ్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారన్నారు. 68 ఏళ్ల ఉదయ భూషణ్‌కు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు చెప్పినా పట్టించుకోకుండా పోలీసులు లాక్కుపోవడం దారుణమన్నారు. ఐటీ యాక్ట్ సెక్షన్లు ప్రకారం వారు పెట్టిన పోస్టులు మూడేళ్లలోపు నేరాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఏడేళ్ల లోపు నేరాల కు 41ఏ నోటీసు ఇచ్చి విచారణ చేయాలని, కాని వారిని అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. వారికి ఏమి జరిగినా పోలీసులదే బాధ్యతని అన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఈసమావేశంలో లీగల్ సెల్ నాయకులు ఎస్.వి. రమణ శోభన్‌బాబు, సురేంద్ర, రాజశేఖర్ . పార్థసారథి, అప్పల నాయుడు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలన అవినీతిమయం

▸▸ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు


మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 : వైసీపీ ప్రభుత్వ పాలన అవినీతి మయంగా సాగుతోందని మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. 46వ వార్డులో బీజేపీ అధ్యక్షుడు గార ఈశ్వరరావు ఆధ్వర్యంలో విష్ణుకుమార్ రాజు పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలివ్వకుండా చోద్యం చూస్తుందని విమర్శించారు. అవినీతిపై ఎవరైనా ప్రశ్నిస్తే జైల్లో పెట్టిస్తున్నారన్నారు. తాను బీజేపీ తరపున మళ్లీ ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నట్లు చెప్పారు.తనను గెలిపిస్తే. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా చలసాని రాఘవేంద్రరావు


చలసాని రాఘవేంద్రరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 13: అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (నాఫ్ కాబ్) డైరెక్టర్‌గా ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రామవేంద్రరావు ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలోని నేషనల్ కో ఆపరేటివ్ యూనియన్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 222 ఓట్లకు గాను 211 ఓట్లతో ఆయన గెలుపొందారు.రాఘవేంద్రరావు డైరెక్టర్‌గా ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు.దేశంలో మొత్తం 1500 అర్బన్ సహకార బ్యాంకులలో వివిధ విభాగాల్లో తొలి 20 స్థానాల్లో ఉన్న విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్‌కు చైర్మన్‌గా ఉన్న ఆయనను ఇప్పుడు నాఫ్‌కాబ్ అభివృద్ధికి తోడ్పడేలా సభ్యులు ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రాఘవేంద్రరావుకు విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు మార్గదర్శకులు మానం ఆంజనేయులు, ఏపీ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, సీపీఐ రాష్ట్ర నేత జేవీ సత్యనారాయణమూర్తి, గుడివాడ భాస్కరరావు, సీఈఓ నరసింహమూర్తిఅభినందనలు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా సెంచరీ క్లబ్ నిర్వహణ

▸▸ క్లబ్ మాజీ సభ్యుడు శివాజీ

దొండపర్తి, ఫిబ్రవరి 13: నగరంలోని మహారాణిపేటలోని ఐబీపీ సెంచరీ క్లబ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్టు క్లబ్ మాజీ సభ్యుడు కె.శివాజీ ఆరోపించారు. దొండపర్తిలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ క్లబ్ 1934లో బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో దీనిని స్థాపించి, 1936లో రిజిస్ట్రేషన్ చేశారని గుర్తు చేశారు. క్లబ్‌లో నిబంధనలకు విరుద్ధంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నారన్నారు. ఈ క్రమంలో క్లబ్ సభ్యుడు ఒకరు కొద్ది రోజుల క్రితం సీతమ్మధారలో అక్రమంగా డిఫెన్స్ మద్యం నిల్వ చేసి పోలీసులకు పట్టుబడినట్టు చెప్పారు. క్లబ్‌లో అక్రమాలు ప్రశ్నించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక కార్పొరేటర్‌కు ఉచితంగా సభ్యత్వం ఇచ్చారని చెప్పారు. క్లబ్‌లో 1200 మంది వరకు సభ్యులున్నారని, గతంలో ఇక్కడ పేకాట, టెన్నిస్ పార్కుల్లో పార్కింగ్ వద్దు అనిచెప్పినందుకుఅక్రమంగా 2019లో తనను, మి త్రుడు పి.వెంకటరమణనుఅన్యాయంగా సస్పెండ్ చేశారన్నారు. క్లబ్ సభ్యులకు కార్మిక శాఖ నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. క్లబ్ నిర్వహణలో 2019 నుంచి 2022 వరకు సుమారుగా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

ఓటు హక్కుప్రాధాన్యంపై రాష్ట్రస్థాయి ప్రచారం



మాట్లాడుతున్న సిటిజన్స్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి లక్ష్మణరెడ్డి

సీతంపేట, ఫిబ్రవరి 13: సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఓటు వేద్దాం- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే నినాదంతో ఈ నెల 25 నుంచి రాష్ట్ర స్థాయి కళాజాతను నిర్వహిస్తున్నట్లు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి పల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కళాజాత విశాఖనుంచి ప్రారంభమై మార్చి 8వతేదీన కర్నూలులో ముగుస్తుందన్నారు. 10 మందితో కూడిన రాష్ట్రస్థాయి కళాబృందం నృత్య నాటికలు, గేయాలు, జానపదాలు, గజల్స్ ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లా కేంద్రాల్లో ఓటు హక్కు ప్రాధాన్యం ప్రజలకు వివరిస్తామని తెలిపారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ కె.చిన్నయ సూరి, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ బోడేపూడి ప్రసాదరావులు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రథమ వైస్ చాన్సలర్ కె.నిరూపారాణి మాట్లాడుతూ ఓటుహక్కుతో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు.

ఖైదీల పరివర్తనలో జైలు అధికారుల కీలకపాత్ర

▸▸ జైళ్ల శాఖ డీజీ హరీశ్‌కుమార్ గుప్త



మాట్లాడుతున్న డీజీ హరీశ్‌కుమార్ గుప్త

ఆరిలోవ, ఫిబ్రవరి 13: కరుడు గట్టిన నేరస్థునిలో కూడా పరివర్తన తీసుకువచ్చి తిరిగి పరిపూర్ణ మనిషిగా తీర్చిదిద్దడంలో జైలు అధికారుల కీలక పాత్ర పోషిస్తున్నారని జైళ్ల శాఖ డీజీ జి. హరీశ్‌కుమార్ గుప్త అన్నారు. ఆయన మంగళవారం ఉదయం విశాఖ కేంద్రకారాగారంలో ప్రారంభించిన పునశ్చరణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్‌లో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారిన నూతన టెక్నాలజీని ఉపయోగించి జైళ్లను ఎలా అభివృద్ధి చేయాలో అధికారులకు సూచించారు. అనంతరం ఆయన జైళ్లకు శాఖకు సంబంధించిన సోషల్ మీడియా అకౌంట్స్‌లో భాగంగా యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్ బుక్ ఇనాస్టా గ్రామ్‌లను డీజీ లాంఛనంగా విడుదల చేశారు. 2024కు సంబంధించి కారాగార శాఖ డైరీతో పాటు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన సోషియాలజీ ప్రొఫెసర్ శ్రీ మన్నారాయణ మూర్తి మాట్లాడారు. గుంటూరు రేంజ్ జైళ్ల శాఖ ఉపశాఖాధికారి ఎంవరప్రసాద్, కోస్తా ఆంధ్రా రాజమహేంద్రవరం జైళ్ల ఉప శాకాధికారి ఎంఆర్ రవికిరణ్ ఫైనాన్స్ ఆఫ్‌ది ప్రిజన్స్‌పై వివరించారు. విశాఖ కేంద్ర కారాగార సూపరిండెంట్ కిశోర్‌కుమార్ నిర్వహించిన ఈ కార్య క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైళ్ల అధికారులు పాల్గొన్నారు.

పాత పింఛన్ పునరుద్ధరించాలి

కంచరపాలెం, ఫిబ్రవరి 13 : పాత పెన్షన్ స్కీంను రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని అమలు తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కేఎస్‌వీ కుమార్ అన్నారు. ఓపీఎస్ సాధనకు ఈనెల 16న చేపట్టనున్న సమ్మెలో కార్మికులంతా ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు స్థానిక బొట్టా నరసింగరావు భవన్‌లో మంగళవారం జరిగిన సెమినార్‌లో కుమార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు చివరికి రక్షణ రంగంలో కూడా ప్రైవేటీకరణను తీసుకువచ్చి దేశ భద్రతను ప్రమాదంలో నెడుతోందన్నారు. డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షులు శ్రీనివాస్, నాగార్జున, అరుణ్, చిట్టిరాజు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు ఆత్మీయ సత్కారం

సీతమ్మధార, ఫిబ్రవరి 13 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణులు రుణపడి ఉంటారని నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లారావు అన్నారు. ఈ మేరకు స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయనకు నాయీబ్రాహ్మణ సభ్యులు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు పుల్లారావుకు అభినందనలు తెలిపారు. డైరెక్టర్ వెంపడపు నూకరాజు, సభ్యులు ఆతవ సుబ్బారావు, గణేష్, గణపతి పాల్గొన్నారు.

నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు గృహ నిర్బంధం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 : నగరంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్‌ను పోలీసులు మంగళవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఆయన స్వగృహం వద్ద నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులకు తమ సమస్యలు చెప్పకపోతే ఇంకెవరికి చెప్పాలని ప్రశ్నించారు.

ఆశీల వసూలు సిబ్బంది తొలగింపు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 13: పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలు చేస్తున్న తమను విధుల్లో తొలగించడంపై ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆ వేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు వారు జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ, జోన్4 అధికారులకు వినతి పత్రాలులు అందజేశారు. గత30 ఏళ్లుగా ఆశీలు వసూళ్ల ఉద్యోగంపై ఆధారపడిన పెద్దాడ నాగేశ్వరరావు తనను తొలగించడంపై కన్నీరుమున్నరవుతున్నారు. తనతో పాటు వి.కాశీబాబు ఆశీలు వసూలు చేసే ఉద్యోగిని ముందస్తు సచారంలేకుండా తొలగించారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. తిరిగివిధుల్లోచేర్చుకుని తమకు న్యాయం చేయాలని అధికారులను అభ్యర్థించారు.

శ్రీవిశ్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ


ఆర్.హేవిద్యార్థులతో శ్రీవిశ్వ కళాశాల అధ్యాపకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్‌లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. విశాఖ శ్రీవిశ్వ విద్యాసంస్థలో చదువుతున్న జాగరపు శ్రావ్య 99.80, పి. ఓంకార్‌సాయిరాయుడు 99.76, జెశ్రావ్యశ్రీ 99.76, ఎం.యశశ్వి 99.64, డి.నవదుర్గశ్రీనితీష్ 99.36, ఆర్.హేమంత్ 99.28, జి.జ్యోతి కిరణ్ 99.21, ఎం.కీర్తన 99.19, జి.వినయ్ 99.10 పర్సంటైల్ సాధించారు. 99 పర్సంటైల్‌పైగా 9మంది, 98 పర్సంటైల్ పైగా 24 మంది సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీవిశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ విద్యార్థులు, సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సభ్యులను, అభినందించారు.

సీఎం సభకు బస్సుల తరలింపుతో పాట్లు

అక్కయ్యపాలెం/జగదాంబ కూడలి, ఫిబ్రవరి 13 : నగరంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడల ముగింపు సభకు జనాలను ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. ఒక్కో వార్డులో 6 నుంచి 8 బస్సులను వైసీపీ నాయకులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. బస్టాపుల్లో గంటల కొద్దీ వేచి నిరీక్షించాల్సి వచ్చింది. విద్యార్థులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా మంది ఆటోలను ఆ శ్రయించారు.

ప్రయాణికులతో ఆడుకున్నారు

... 3వ పేజీ తరువాయి


సీఎం సభకు బస్సులో జనాల తరలింపు

జనాలను తరలించేందుకు నగరంలో వార్డుకు ఐదు నుంచి ఎనిమిది బస్సులు చొప్పున కేటాయించారు. జనసమీకరణ బాధ్యతలను డ్వాక్రా గ్రూపుల ఆర్‌పీలకు అప్పగించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఈ బస్సులు బయలుదేరాల్సి ఉండగా చాలాచోట్ల ఎవరూ ముందుకు రాలేదు. దాంతో గ్రూపు సభ్యులకు ఆర్పీలు ఫోన్లు చేసి తప్పనిసరిగా రావాల్సిందేనని చెప్పారు. అయినా ఎవరూ స్పందించకపోవడంతో బెదిరింపులకు దిగారు. ప్రస్తుతం రుణమాఫీ కార్యక్రమం జరుగుతోందని, సీఎం సభకు రానివారికి ఆ పత్రాలపై సంతకాలు చేయబోమని హెచ్చరించారు. బస్సులో వచ్చిన వారికే రుణ మాఫీ జరుగుతుందని స్పష్టంచేశారు. దాంతో మహిళలు కొంతమంది తిట్టుకుంటూనే బస్సులు ఎక్కారు. అయినా చాలా బస్సులు పది నుంచి పదిహేను మందితోనే బయలుదేరి వెళ్లాయి. ఉత్తర నియోజకవర్గంలో సభకు తీసుకువెళ్లే మహిళల కోసం పోర్టు స్టేడియంలో బిర్యానీ తయారు చేయించి, ప్యాకెట్లు కట్టి పంపిణీ చేశారు. అయితే సీఎం జగన్ సాయంత్రం ఆరు గంటలకు వస్తారని, రాత్రి ఎనిమిది గంటల వరకు ఉండాలని అక్కడికి వెళ్లాక తెలియడంతో చాలా మంది ఆయన రాక ముందే తిరుగు ముఖం పట్టారు. వెళ్లిన బస్సులో వచ్చే అవకాశం లేకపోవడంతో సొంత డబ్బులు పెట్టుకొని ఆటోలలో ఇళ్లకు చేరుకున్నారు. ఇలా మహిళలు వెళ్లిపోతున్నారని గమనించిన నిర్వాహకులు స్టేడియంలో గేట్లకు తాళాలు వేసేశారు.

ప్రజల ఇక్కట్లు: విశాఖపట్నం రీజియన్‌లో ఆర్టీసీకి 820 బస్సులు ఉన్నాయి. వాటిలో 230 బస్సులు సీఎం సభకు కేటాయించడంతో చాలా రూట్లలో ఉదయం నుంచే బస్సులు రద్దయ్యాయి. ఈ విషయం తెలియక రెగ్యులర్‌గా ఆ మార్గాల్లో ప్రయాణించేవారు బస్సుల కోసం బస్టాపులో గంటల తరబడి నిరీక్షించారు. ఎంతకీ బస్సులు రాకపోవడంతో విషయం తెలుసుకుని కొందరు ఆటోలను ఆశ్రయించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, గురుద్వారా, అక్కయ్యపాలెం, గాజువాక, సింహాచలం, పోస్టాఫీసు జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

జేఈఈ మెయిన్స్ మెరుపులు

... 3వ పేజీ తరువాయి

తిరుపతిరావు గజపతినగరంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 7.15 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకూ సుమారు 14 గంటలపాటు చదువుకు కేటాయించేవాడిని

రోజుకు 16 గంటలు చదివేవాడిని

- కోరుప్రోలు రాకేష్, 99.978 పర్సంటైల్ విద్యార్థి

సొంతూరు విశాఖపట్నం. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు శ్రీచైతన్య విద్యాసంస్థలలో చదివాను. టెన్త్‌లో 590 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో 99.978 పర్సంటైల్ సాధించడం సంతోషంగా ఉంది. మరింత మెరుగైన పర్సంటైల్ కోసం ఏప్రిల్‌లో జరగనున్న సెకండ్ సెషన్ పరీక్షలకు హాజరవుతా. తరువాత ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించడం ద్వారా ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరాలన్నదే లక్ష్యం. రోజుకు 16 గంటలపాటు చదివాను. నాన్న సతీష్ ఆయుర్వేద వ్యాపారం చేస్తారు. ఐఐటీలో చదివిన మా మేనమామే స్ఫూర్తి.

ఓటర్ల జాబితాలో అవకతవకలు

... 3వ పేజీ తరువాయి

వస్తుందని, తప్పుచేసిన అధికారులపై చర్యలు ఉంటాయని బండారు స్పష్టంచేశారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ కలెక్టర్ మల్లికార్జున హయాంలో జరిగిన కుంభకోణాలకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని అన్నారు. అక్రమంగా ఓట్లు చేర్చుతున్నారని అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 90 బూత్‌లలో పలు వీధుల్లో ఒక్కొక్కరికి రెండు నుంచి నాలుగు ఓట్లు ఉన్నాయన్నారు. గతంలో రెవెన్యూ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు చక్కగా చేసేవారని, ఇప్పుడు సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించిన తరువాత తప్పులు వచ్చాయన్నారు. ఇదే విషయం చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ నిర్లక్ష్యంపై తక్షణమే ఎన్నికల సంఘం విచారణ చేపట్టాలని లేకపోతే కోర్టును ఆశ్రయిస్తామని వెలగపూడి స్పష్టంచేశారు.

నేటి నుంచి ఉద్యోగుల ఉద్యమం

... 3వ పేజీ తరువాయి

జిల్లా పర్యటనలు చేసి ఉద్యోగు లను జాగృతం చేస్తారని తెలిపారు. ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామ న్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే ఏ క్షణానైనా మెరుపు సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్టీసీ జోనల్ సెక్రటరీ ఎంవీఆర్ మూర్తి, ఎస్.సత్తిబాబు, అప్పలరాజు, టి.గోపాలకృష్ణ, రామకృష్ణ, ఆర్.రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.


మొక్కుబడిగా ఆర్‌బీఎస్‌కే!

... 3వ పేజీ తరువాయి

జరిగిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ స్కూల్స్‌లో మాత్రమే నిర్వహించారు. అది కూడా స్కూల్ యాజమాన్యాలకు అప్పగించి అధికారులు చేతులు దులుపుకున్నారు. అదే రోజు ఆశ కార్యకర్తలు సమ్మెలో ఉన్నారు. ఆశించిన స్థాయిలో మాత్రలు పంపిణీ జరగలేదు. కానీ, అధికారులు మాత్రం ఈ నెల తొమ్మితో తేదీన నిర్వహించిన మాత్రల పంపిణీ కార్యక్రమం 97 శాతం మేర పూర్తయినట్టు ప్రకటించారు. ఇలా, ఆర్‌బీఎస్ ప్రోగ్రామ్స్‌ను అమలు చేస్తున్నట్టు లెక్కల్లో చూపిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కానరావడం లేదు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చూపిస్తాం

▸▸ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్


మాట్లాడుతున్న మాణిక్యం ఠాగూర్

పెందుర్తి (విశాఖపట్నం), ఫిబ్రవరి 13: రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో గల క్రియాశీలక కార్యకర్తలతో మంగళవారం ఆయన సుజాతనగర్‌లోని ఇంద్రాణి ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాణిక్యం ఠాగూర్ మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగిందన్నారు. పార్టీ పటిష్టానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఇందుకు పార్టీ గ్రామ, బూత్, జిల్లా స్థాయి కమిటీలు శ్రమించాలన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు గొంప గోవింద్, బొడ్డు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, విజయనగరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శరగడం రమేశ్‌కుమార్, జిల్లా పార్టీ నేతలు కొయ్యి ప్రసాదరెడ్డి, వేగి దివాకర్, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అడారి రమేశ్‌నాయుడు, విన్నకోట రాము పాల్గొన్నారు.

భద్రతా ఆడిట్, నిర్మాణ పనులపై డీఆర్ఎం సమీక్ష

విశాఖపట్నం, ఫిబ్రవరి 13: డివిజన్ పరిధిలోని పలు స్టేషన్‌లో మంగళవారం డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ పర్యటించి భద్రతా ఆడిట్, అభివృద్ధి నిర్మాణ పనులపై సమీక్షించారు. ముందుగా శ్రీకాకుళం, విజయనగరం మధ్య గల మూడు (త్రీ) లెవెల్స్ క్రాసింగ్ గేట్ల వద్ద ఇంటర్ లాకింగ్ పనులను పరిశీలించి అక్కడి సిబ్బందితో మాట్లాడి భద్రతా నియమాలపై సమీక్షించారు. అక్కడ నుంచి విండో ట్రయిలింగ్ ద్వారా కొత్తవలస స్టేషన్‌కు చేరుకుని తనిఖీలు చేశారు. తర్వాత నౌపడ స్టేషన్ వద్ద యార్డు లేఅవుట్, బ్యాటరీ గది, రిలే రూమ్‌లతో పాటిస్తున్న భద్రతా చర్యలను తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడారు.

అప్పన్నకు వైభవంగా గరుడసేవ

సింహాచలం, ఫిబ్రవరి 13: వరాహలక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం ఆర్జితసేవలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళితో అర్చన చేశారు. ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని పూర్తిచేశారు.

పంట రుణాలు ఇవ్వాలి

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 13: భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులను మంజూరు చేసి, వారికి వడ్డీ లేని పంట రుణాలను మంజూరు చేయాలని తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. దేవదాయ భూములు సాగుచేస్తున్న వారికీ సీసీఆర్ కార్డులు, పంట రుణాలందించాలన్నారు.

'డీఎస్సీలో అప్రెంటిస్ విధానం వద్దు'

పద్మనాభం(రూరల్), ఫిబ్రవరి 13: డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రతినిధి ఉప్పాడ రాము విమర్శించారు. మంగళవారం యూనియన్ ప్రతినిధుల సమక్షంలో జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 వేల ఉపాధ్యాయ పోస్టులు రాష్ట్రంలో ఖాళీగా ఉంటే కేవలం ఆరువేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను దగా చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కె.సన్యాసిరావు, తాలాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష

భీమునిపట్నం, ఫిబ్రవరి 13: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత బుధవారం శ్రీనగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్నట్టు జోనల్ కమిషనరు శైలజవల్లి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

కృష్ణా కళాశాలలో మాక్ పోలింగ్

మద్దిలపాలెం, ఫిబ్రవరి 13: డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల్లో ఏ విధంగా ఓటు వేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ కొత్త ఓటర్లుగా నమోదైన విద్యార్థులు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి పి.ధనలక్ష్మి, కో ఆర్డినేటర్లు కె.రవిబాబు, శ్రావణ్‌కుమార్, పోల ఉమామహేశ్వరరావు, రూపవాణి, బి.పద్మ, సి.హెచ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 13: కైలాసగిరి తెలుగు మ్యూజియం ఫీడర్ నిర్వహణలో భాగంగా బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాజేష్ తెలిపారు. జోడుగుళ్లపాలెం, దయాల్‌నగర్, కో-ఆపరేటివ్ లేఅవుట్, ఎస్సీ, ఎస్టీ కాలనీ, పోలీసు పెట్రోల్ బంక్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

25న మానవ హక్కులపై సదస్సు

రామ్‌నగర్, ఫిబ్రవరి 13: మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 25న శ్రీకాకుళంలో ఉత్తరాంధ్ర సదస్సు నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మానవ హక్కులకు సంబంధించిన అంశాలపై అవగాహనతో పాటు జీవించే హక్కు ఇతర అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామని, త్వరలోనే జరుగనున్న రాష్ట్ర స్థాయి సదస్సు పలు అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

పంట నమోదు పరిశీలన

ఆనందపురం ఫిబ్రవరి 13: మండలంలోని వేములవలస రైతు భరోసా కేంద్రాన్ని వ్యవసాయ ఉపసంచాలకులు ఎం.జగ్గారావు మంగళవారం సందర్శించారు. గొట్టిపల్లిలో ఈ పంట నమోదు పరిశీలించారు రబీ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్:** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 20, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 44, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 18, క్యారెట్ 24, దొండకాయలు 34, బంగాళదుంపలు 15, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 30, కంద 54, దేముడుచిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	117
ఫారం ధర	--	137
విత్ స్కిన్	--	244
స్కిన్‌లెస్	--	254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..

సీఎం సభకు బస్సులు... జనానికి తిప్పలు


ఎండాడ కూడలిలో బస్సుల కోసం ప్రయాణికులు

ఎండాడ, ఫిబ్రవరి 13: ఆడుదాం ఆంధ్ర ముగింపు కార్యక్రమానికి సీఎం రావడంతో పీఎంపాలెం స్టేడియం పోలీసు పహారాలో ఉంది. ఒక్కసారిగా బస్సులన్నీ స్టేడియం వద్దకు చేరుకోవడంతో మధురవాడ నుంచి విశాఖ వ్యాలీ స్కూల్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో సామాన్యులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. డ్వాక్రా మహిళలు, పింఛనుదారులు సాయంత్రం ఐదు గంటలకే వెనుదిరిగారు. మరికొందరు స్టేడియం వద్ద బస్సు దిగి ఆర్పీలు, వలంటీర్లతో సెల్ఫీ దిగి ప్రైవేట్ వాహనాలలో వెళ్లిపోయారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో అంబులెన్స్‌లు చిక్కుకున్నాయి. సీఎం వచ్చిన వెంటనే మహిళలు బయటకు వచ్చేశారు. తూర్పు గోదావరి క్రికెట్ జట్టును స్టేడియంలోకి అనుమతించకపోవడంతో వారు నిరసన తెలిపారు. విశాఖ జట్టును ఫైనల్స్‌కి పంపే కుట్రలో భాగంగా అనర్హులుగా ప్రకటించడంతో ఆందోళనకు దిగారు. వారిని పోలీసులు బెదిరించి వెళ్లగొట్టారు.

విశాఖపట్నం: సీఎం సమావేశానికి బస్సులు కేటాయించడంతో కారుషెడ్, మధురవాడ, కొమ్మాది తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు పడ్డారు. అరకొరగా వచ్చిన బస్సుల్లోనే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం తదితర ప్రాంతాలకు ప్రయాణాలు కొనసాగించారు. ప్రైవేటు బస్సులు, క్యాబ్‌ల యజమానులు రెట్టింపు చార్జీలను వసూలు చేశారు. పీఎం పాలెం ఏపీహెచ్‌బీ కాలనీ రహదారుల్లో బస్సులు నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. సీఎం సభ జరుగుతుండగానే కొందరు వెనుతిరిగి వెళ్లిపోయారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు బస్సుల్లోనే ఉండిపోయారు. సభాప్రాంగణం వైపు వెళ్లలేదు. జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులు వేసినప్పటికీ కొన్నింటిలో పదిమంది కూడా రాలేదు. స్టేడియం వద్ద జేబుదొంగలు పర్సులు, సెల్‌ఫోన్లు అపహరించారు.

బస్సులన్నీ ఖాళీ

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ, 23వ వార్డు నుంచి ఆడుదాం ఆంధ్ర ఫైనల్ సభకు ఖాళీ బస్సులే బయలుదేరాయి. ఇక్కడి నుంచి కనీసం 500 మందిని తరలించడానికి యత్నించి పిఠాపురంకాలనీ కళాభారతి రోడ్డులో ఏడు బస్సులు ఏర్పాటు చేశారు. జనాల కోసం ఆర్పీలు వేచిచూశారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు వచ్చిన సుమారు 50 మందిని రెండు బస్సుల్లో ఎక్కించారు. మిగిలిన బస్సులను వెనక్కి పంపారు.

స్కూల్ బస్సుల్లో డ్వాక్రా మహిళల తరలింపు

సాగర్‌నగర్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి డ్వాక్రా మహిళలను స్కూల్ బస్సులలో తరలించారు. సాగర్‌నగర్ సచివాలయం ఎదురుగా పలు బస్సులను సిద్ధం చేశారు. ఆటల పోటీలకు యువత, క్రీడాకారులను తరలించాలని, మాకేమిటి పని అంటూ మహిళలు ప్రశించారు. అయితే పథకాలు పోతాయని భయపెట్టడంతో కొంతమంది బస్సుల్లో తరలివెళ్లారు.

సిటీబస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

భీమునిపట్నం: సీఎం సభకు జనాలను సిటీ బస్సుల్లో తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు విడిచిపెట్టిన తర్వాత విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది.

బలవంతంగా మహిళల తరలింపు

వెంకోజీపాలెం: సీఎం సభకు బయలుదేరిన బస్సులు మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో వార్డు సచివాలయం సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి డ్వాక్రా మహిళలను బలవంతంగా తీసుకుని వెళ్లారు.

దూర ప్రాంత ప్రయాణికుల అవస్థలు

ఆరిలోవ: సీఎం జగన్ పర్యటనతో శ్రీకాకుళం , విజయనగరం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హనుమంతవాక జంక్షన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. పెదగదిలి బీఆర్‌టీఎస్‌లో బస్సులులేక నిర్మానుష్యంగా కనిపించింది.

రోడ్డుపైనే బస్సుల పార్కింగ్


భీమిలిలో సిటీ బస్సుల కోసం నిరీక్షణ

కొమ్మాది: బస్సులను క్రికెట్‌స్టేడియం ఎదురుగా జాతీయరహదారిపై నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. నగరంలోకి వెళుతున్న అంబులెన్స్ పి.ఎం.పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో ఇరుక్కుపోయింది. బస్సులలో వచ్చిన మహిళలు సెల్ఫీలు తీసుకుని స్టేడియంలోకి అడుగుకూడా పెట్టకుండా జారుకున్నారు. సభ ప్రారంభానికి ముందే జనం సొంతఖర్చులతో వెనుదిరిగారు. స్టేడియంలోకి వెళ్లిన వారు సైతం తిరిగి వెళ్లిపోతుండటంతో పోలీసులు స్టేడియం గేట్లను మూసివేసి అడ్డుకున్నారు. ఆర్పీలు రోడ్డుపైకి వచ్చిమరీ జనాన్ని స్టేడియంలోకి వెళ్లవలసిందిగా ఒత్తిడిచేసినా ఫలితమివ్వలేదు. కొంత మంది వృద్ధులు ఎందుకువచ్చారో తెలియదు. వలంటీరు రమ్మన్నారని, లేదంటే పింఛన్ ఆపేస్తానన్నారని చెప్పారు.

అప్పన్న భక్తులకు అవస్థలు

సింహాచలం: ఆర్టీసీ బస్సులన్నీ సీఎం సభకు తరలించడంతో భక్తులు అవస్థలు పడ్డారు. ఉదయం 9గంటల నుంచే సింహాచలం డిపోలోని 50బస్సులను సీఎం సభకు తరలించారు. ఏ బస్సులోను పూర్తిస్థాయిలో ప్రజలు లేరు, బస్సులు అందుబాటులో లేక సాధారణ ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు అప్పన్న భక్తులు ఇక్కట్లు పడ్డారు. బస్సులు నడకపకోవడంతో సింహాచలం డిపోకు సుమారు రూ.8లక్షల నష్టం వాటిల్లినట్టు గణాంకాలను బట్టి తెలుస్తోంది.


సీఎం సభకు ఖాళీగా వెళ్తున్న బస్సు


సభ ప్రారంభానికి ముందే తిరిగి వెళ్లిపోతున్న మహిళలు

ధరలమోతతో నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

» తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ధరలు పెరుగుదలను నియంత్రించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దుయ్యబట్టారు. జీవీఎంసీ 9వ వార్డు పరిధి చలపతినగర్‌లో వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం జగన్‌కు పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేశారన్నారు. చంద్రబాబు విడుదల చేసిన ఆరు గ్యారెంటీలతో సామాన్య ప్రజలకు ఉపశమనం లభిస్తుందన్నారు. ఎన్నికల వేళ వైసీపీ నాయకులు దోచుకున్న నోట్ల కట్టలతో ఇంటింటికీ వస్తారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బుడుమూరి గోవింద్, వేజెళ్ల సుబ్బరాజు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, అన్నె రాజా, గొలగాని వెంకన్న, ఈగల కొండలరావు, గరికిన నూకరాజు, బోయసాయి, మైలపల్లి శ్రీను, శివ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లికి బంతిపూలతో అలంకరణ



తగరపువలస, ఫిబ్రవరి 13: స్థానిక సంతపేట కొత్తమ్మ తల్లిని మంగళవారం బంతిపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ప్రతి మంగళవారం అమ్మవారిని దాతల సహకారంతో విభిన్న రకాలుగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆరిలోవ, ఫిబ్రవరి 13: చినగదిలి నార్త్ షిర్డి సాయిబాబా ఆలయం 12వ వార్షికోత్సవం మూడవ రోజు ముగింపు ఉత్సవం సందరంగా మంగళవారం బాబాకు భక్తులు స్వయంగా అన్నాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు నాణేలతో ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలతో అలంకరించారు. 18 రకాల పిండి వంటలను సిద్ధం చేసిన భక్తులకు స్వామికి నైవేద్యంగా సమర్పించారు. బాబా ఆలయాన్ని వివిధ రకాల పరిమళభరిత పూలమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేపట్టారు. ఆలయం ట్రస్టీ వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

లోకేశ్ శంఖారావం విజయవంతం చేయండి

» భీమునిపట్నం టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు

భీమునిపట్నం, ఫిబ్రవరి 13: భీమిలి నియోజకవర్గంలో ఈనెల 17న టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్ నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గంలో ముఖ్యనాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకేశ్ ప్రారంభించిన శంఖారావం పర్యటన 17న భీమిలి చేరుతుందన్నారు. ఈ సందర్భంగా, ఆనందపురం-తగరపువలస రహదారిలో సభ ఏర్పాటుకు స్థలాలను పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని కోరారు. పార్టీ సోషల్ మీడియాలో అత్యధికంగా కంటెంట్ షేర్ చేసిన వారిని అభినందించారు. అధిష్ఠానవర్గం పార్టీ జెండాలను, పార్టీ గుర్తుగా ఉన్న సైకిల్‌ను, పార్టీ జెండాలను పంపించిందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురి నాయకులను సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి గంటా నూకరాజు, మండల అధ్యక్షులు దంతులూరి అప్పలనరసింహరాజు, బీసీ సెల్ ఉపాధ్యక్షులు గొల్లంగి ఆనందబాబు, నేతలు దామోదరరావు, 1,4,5,8 వార్డుల అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, పాసి నర్సింగరావు, నాగోతి శివాజీ, బోయి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత శివాజీకి బహుమతి

మధురవాడ: తెలుగుదేశం పార్టీ యాప్‌లో పోస్ట్ చేసిన వివిధ రకాల పోస్టులకు 30 వేల పాయింట్లు సాధించిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీకి ఆ పార్టీ నుంచి ప్రశంసలతో పాటు బహుమతి లభించింది. టీడీపీ సోషల్ మీడియాతో పాటు ఆ పార్టీ అప్లికేషన్‌లోనూ శివాజీ పెట్టిన పోస్టింగులు యువనేత, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను కూడా ఆకట్టుకున్నాయి. ఈ మేరకు పార్టీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు శివాజీకి మంగళవారం అధిష్ఠానం పంపించిన టీడీపీ జెండాను అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి ఇంకా మెరుగైన సేవలు అందించాలని, సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు.


పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాజబాబు

నిబంధనలకు విరుద్ధంగా క్రీడాకారుల ఎంపిక

తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారుల ఆరోపణ

కొమ్మాది, ఫిబ్రవరి 13: ఆది నుంచీ వివాదాలకు కేంద్రంగా మారిన ఆడుదాం ఆంధ్ర పోటీలు మంగళవారం నాటి ఫైనల్స్‌లోనూ వెలుగుచూశాయి. శాప్ అధికారులు పక్షపాతి ధోరణితో వ్యవహరిస్తున్నారని తూర్పుగోదావరి జిల్లాఅనపర్తి 4వనంబరు సచివాలయం క్రీడాకారులు ఆరోపించారు. ఆడుదాం -ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రికెట్‌మ్యాచ్‌లో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి 4వనంబరు సచివాలయ క్రికెట్ జట్టుకు విశాఖపట్నం నక్కవానిపాలెం సచివాలయం జటుఒకు మధ్య సోమవారం సెమీఫైనల్స్ నిర్వహించారు. ఇందులో విశాఖపట్నం నక్కవానిపాలెం సచివాలయం జట్టులోని నలుగురు క్రీడాకారులు ఇతర ప్రాంతాలకు చెందిన సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారని తూర్పుగోదావరి జట్టు సభ్యులు ఆరోపించారు. ఇది ఆడుదాం ఆంధ్ర పోటీల నిబంధనలకు విరుద్ధమంటూ అభ్యంతరం వ్యక్తం చేయడంతో మ్యాచ్ అయిపోయిన తరువాత వారు వేరే పేర్లతో క్రికెట్ ఆడినట్టు తేలితే డిస్ క్వాలిఫై చేస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారన్నారు. కాగా మ్యాచ్ ముగిసిన తరువాత ఆ ప్రాంతంలో నిర్వాహకులు ఎవరూ కనిపించకుండా పోయారన్నారు. కొమ్మాది స్టేడియంలో థర్డ్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉండాలని సోమవారం రాత్రి మెసేజ్ పంపించారని, మంగళవారం ఉదయం కొమ్మాది స్టేడియం వద్దకు వెళ్లిన జట్టు సభ్యులంతా సెమీ ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించి జరిగిన నిబంధనల ఉల్లంఘనలపై వివరణ ఇవ్వాలని కోరడంతో ఉదయం 11గంటల సమయంలో విశాఖపట్నం జట్టుకు సంబంధించిన సభ్యులు పరిశీలన ఉందని, అక్కడి రావాలని అధికారులు సూచించారన్నారు. దీంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణానికి వెళ్లగా అక్కడ పరిశీలనలో విశాఖపట్నం జట్టులోని నలుగురు క్రీడాకారులు ఇతర ప్రాంతాలకు చెందిన సీనియర్ ఆగటాళ్లుగా రుజువైందని, అయినప్పటికీ శాప్ అధికారులు కనీసం స్పందించలేదని ఆరోపించారు. పైగా అక్కడ పరిశీలన జరుగుతుండగానే కడప జట్టు గెలిచినట్టు ప్రకటించారని, కానీ ఇక్కడి క్రికెట్ స్టేడియంలో విశాఖపట్నం- పశ్చిమగోదావరి జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభించారన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు డిమాండు చేశారు. అన్యాయం చేసిన క్రీడా అధికారులపై చర్యలుతీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు

గ్రేటర్ 22వ వార్డులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 13: జీవీఎంసీ 22వ వార్డులో మంగళవారం వైసీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. 22వ వార్డులో రూ.కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రోడ్డులు, డ్రైనేజీ, శ్మశానవాటికల నిర్మాణాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ మూర్తియాదవ్ గృహ నిర్బంధం

పెదవాల్తేరు, ఫిబ్రవరి 13: సీఎం జగన్ విశాఖ పర్యటనతో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌ను మంగళవారం గృహ నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పేరిట సీఎం జగన్ రెడ్డి, మంత్రి రోజా, బైరెడ్డి సిద్దార్థరెడ్డి అవినీతికి పాల్పడ్డారన్నారు. యువత, క్రీడాకారుల బతుకులతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. క్రీడల్లో మొదటి రోజు కనీసం క్రీడాకారులకు కడుపునిండా అన్నం పెట్టలేకపోయారన్నారు. మంచి నీళ్లు ఇవ్వలేదన్నారు.


మూర్తియాదవ్‌తో పోలీసు

'జూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

తగరపువలస, ఫిబ్రవరి 13: అధికారుల సమక్షంలో అంగీకరించిన అనేక ఒప్పందాలను అమలుచేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ కార్మికసంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో జీవీ కైలాస్‌రెడ్డి మాట్లాడుతూ బకాయిలను చెల్లించకుండా భూములను దొడ్డిదారిన అమ్ముకోవాలని చూస్తున్నారని, దీనిని అడ్డుకుంటామన్నారు. దల్లి అప్పలరెడ్డి, కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20న విశాఖ పీఎఫ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఎం.దేముళ్లు, అల్లు బాబూరావు, అప్పారావు, ప్రసాదరావు రమణ, కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం: సీపీఐ

ఆరిలోవ, ఫిబ్రవరి 13: పేదలకు తమ పార్టీ అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. వీఎస్‌ఆర్‌నగర్ ఐద్వా కార్యదర్శి గౌరి భర్తసంగిరెడ్డి తవిటినాయుడు సంస్మరణ సభలో పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు. భవననిర్మాణ కార్మికులు సమస్యలపై పోరాడారన్నారు. కార్యక్రమంలో నాగరాజు, నరేంద్రకుమార్ రంగమ్మ, లక్ష్మీనారాయణ, శంకరరావు, రాము, పూజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగుపర్చాలి

భీమునిపట్నం, ఫిబ్రవరి 13: స్థానిక వైజాగ్ రోడ్ గొల్లలపాలెం, యాతకుమ్మరిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం భీమిలి డైట్ అధ్యాపకులు సారిపల్లి త్రినాథరావు సందర్శించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు కిరణ్, ఉపాధ్యాయులు కోటి, రాజేశ్వరి, విజయకుమారి పాల్గొన్నారు.

రక్తహీనతపై విద్యార్థులకు అవగాహన

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 13: మండలంలోని తాళ్లవలస బాలల సంరక్షణ కేంద్రంలో విద్యార్థులకు మంగళవారం సంగివలస ఎన్‌ఆర్ ఆసుపత్రి వైద్యులు రక్తహీనతపై అవగాహన కలిగించారు. డాక్టర్లు ప్రతిమాదేవి, రామభద్రరాజు జగన్నాథ్ తదితరులు రక్తపుష్టికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. వెంపాడ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాఘమాస విశిష్టతపై ప్రచారం

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 13: మండలంలోని చిప్పాడ గ్రామంలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి సభ్యులు మాఘమాసంలో వచ్చే పండగల విశిష్టతపై ప్రచారం చేశారు. మాఘపూర్ణిమ భగవంతుని జన్మను తెలుపుతుందన్నారు. ఈ మాసంలో చేసే పూజలకు విశిష్టమైన ఫలితం ఉంటుందని కమిటీకి చెందిన టి. త్రినాధరావు తెలిపారు. ఇంటింటికి వెళ్లి మహిళలకు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వి. సురేష్, అంకమ్మ, రాజేశ్వ రి, రాజు, భవాని, బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు. వివిధ ఆధ్యాత్మిక గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు.

'రవాణా బంద్‌ను జయప్రదం చేయాలి'



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆరిలోవ, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల పిలుపు నిచ్చాయి. ఇందులో భాగంగా ఆరిలోవ రవీంద్రనగర్ చివరి బస్టాప్‌వద్ద కరపత్రాలను మంగళవారం పంచారు. సీఐటీయూ ప్రధానకార్యదర్శి ఆర్‌కేఎస్ కుమార్ మాట్లాడుతూ నూతన రవాణా చట్టాలతో డ్రైవర్లు, యజమానులకు ఇబ్బందికి లోనవుతారన్నారు. వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు నరేంద్రకుమార్, నాగరాజు, లక్ష్మీనారాయణ, రాము, కోటేశ్వరరావు, సత్యనారాయణ, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

కొబ్బరితోట పార్కులో కుక్కల బెడద

భీమునిపట్నం, ఫిబ్రవరి 13: భీమిలి బీచ్‌రోడ్డులోని కొబ్బరితోట పార్కులో కుక్కల బెడద ఎక్కువైంది. ఏ క్షణంలో దాడి చేస్తాయోనని సందర్శకులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆనందంగా గడుపుదామనుకుని వస్తున్న వారు వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. అలాగే, పార్కులో చెత్తాచెదారాలతో అపరిశుభ్రతగా వుండడంతో సందర్శకులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది పర్యవేక్షణ లోపంపై పలువురు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారత్ రైస్‌కు జనం ఎదురుచూపులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్ రైస్ కోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. దీనిపై రైతు బజార్లకు వచ్చి ఆరా తీస్తున్నారు. రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా భారత్ దాల్ పేరిట రూ.60లకు శనగపప్పు విక్రయిస్తున్నారు. ఇక్కడి రైతు బజారులో రోజూ 800 నుంచి వెయ్యి కిలోల వరకూ భారత్‌దాల్ విక్రయాలు సాగుతున్నాయి. సోమవారం మరో నాలుగు టన్నుల శనగపప్పు చేరుకుంది. దీంతో పాటు సన్నబియ్యం కిలో రూ.46 చొప్పున విక్రయిస్తున్నారు. కాగా వెల్లుల్లి ధర మళ్లీ పెరిగింది. సోమవారం కిలో రూ.250 ఉండగా మంగళవారం 310 రూపాయలకు చేరుకుంది.

డీఐజీ విశాల్ గున్నీని కలిసిన ఏఎస్పీలు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 13: విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన విశాల్ గున్నీని మంగళవారం పలువురు అదనపు ఎస్పీలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఐజీ అల్లూరి సీతారామరాజు, మన్యం పార్వతీపురం జిల్లాల అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో చింతూరు, అనకాపల్లి, శ్రీకాకుళం, రంపచోడవరం, పాడేరు, పార్వతీపురం సబ్ డివిజన్ అదనపు ఎస్పీలు రాహుల్‌మీనా, పి.సత్యనారాయణ, ప్రేమకాజల్, కె.ధీరజ్, జగదీష్ అడహల్లి, సునీల్ షరీన్ పాల్గొన్నారు.